మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 30-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 120 Issue: 120

30 అక్టోబర్ 2025 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:17 సూర్యాస్తమయం - సా. 5:41 తిథిః అష్టమి ఉ. 10:03 వరకు తరువాత నవమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం శ్రవణ సా. 6:19 వరకు తరువాత ధనిష్ఠ యోగం శూల ఉ. 7:16 వరకు కరణం బవ ఉ. 10:03 వరకు బాలవ రా. 10:05 వరకు వర్జ్యం రా. 10:36 నుండి రా. 12:13 వరకు దుర్ముహూర్తం ఉ. 10:05 నుండి ఉ. 10:51 వరకు మ. 2:39 నుండి మ. 3:24 వరకు రాహుకాలం మ. 1:25 నుండి మ. 2:50 వరకు యమగండం ఉ. 6:17 నుండి ఉ. 7:43 వరకు గుళికాకాలం ఉ. 9:08 నుండి ఉ. 10:34 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:41 నుండి తె. 5:29 వరకు అమృత ఘడియలు ఉ. 7:56 నుండి ఉ. 9:37 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:36 నుండి మ. 12:22 వరకు

Published From Jagitial

www.evarthalu.com



## రాఫెల్‌లో రాష్ట్రపతి

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాఫెల్ యుద్ధ విమానంలో విహరించారు. హర్యానాలోని అంబాలా ఎయిర్‌బేస్ నుంచి రాఫెల్ ఫైటర్ జెట్‌లో ద్రౌపది ముర్ము ప్రయాణించగా.. వాయుసేన చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ ఏడాది మే నెలలో పాకిస్తాన్‌పై భారత్ నిర్వహించిన.. ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ ఫైటర్ జెట్లు కీలక పాత్ర పోషించాయి. పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన రాఫెల్ యుద్ధ విమానంలో తాజాగా ద్రౌపది ముర్ము చక్కర్లు కొట్టడం గమనార్హం. బుధవారం అంబాలా ఎయిర్‌బేస్‌ను సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పైలట్ శివంగి సింగ్ స్వయంగా కొత్త రాఫెల్ యుద్ధ విమానాల గురించి వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతితో కలిసి ఆమె నవ్వుతూ ఒక ఫోటోకు పోజు ఇచ్చారు. ఈ ఫోటోను ఐఏఎఫ్ షేర్ చేయడంతో శివంగి సింగ్‌పై పాకిస్తాన్ ప్రచారం పచ్చి అబద్ధమని ప్రపంచానికి వెల్లడైంది.




## జనజీవన స్రవంతిలో మావోయిస్టులు

**54 మంది నక్సల్స్ లొంగుబాటు**

**ఛత్తీస్‌గఢ్ పోలీసుల ఎదుట సరెండర్**

**మావోయిస్టు పార్టీకి మరో షాక్**

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 51 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 20మందిపై మొత్తంగా రూ.66 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు బుధవారం ప్రకటించారు. 51మందిలో తొమ్మిది మంది మహిళలు ఉన్నారు. లొంగిపోయిన వారిలో పీపుల్స్

- తరువాయి 2 వ పేజీలో...

## కాలేజీలు వర్సెస్ సర్కారు

**బకాయిలు చెల్లించాలని విద్యాసంస్థల డిమాండ్**

**సౌకర్యాలపై తనిఖీ చేయాలని విజిలెన్స్‌కు ఆదేశాలు**

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): ఒకవైపు తమకు చెల్లించాల్సిన రూ.600 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, లేదంటే విద్యాసంస్థల సంపూర్ణ బంద్ ప్రకటిస్తామని విద్యాసంస్థల హెచ్చరిక.. మరోవైపు, విద్యాసంస్థల్లో సౌకర్యాలపై తనిఖీలు నిర్వహించాలని విజిలెన్స్‌కు సీఎం ఆదేశాలు. ఇలా రాష్ట్రంలో కాలేజీలు వర్సెస్ సర్కారు అన్నట్లుగా ఉంది పరిస్థితి. దసరాకు ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదని, కాలేజీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఇకనైనా ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇదిలా ఉంటే.. ఉన్నత విద్యాసంస్థలు, ప్రొఫెషనల్ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలపై తనిఖీలు చేయాలని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. అయితే తాము బకాయిలు అడిగితే తనిఖీలు చేయడం ఏమిటని మండిపడుతున్నాయి విద్యాసంస్థలు.

- తరువాయి 2 వ పేజీలో...

# తాగుడే తాగుడు

**భారత్‌లో భారీగా మద్యం వినియోగం.. రాబోయే ఐదేళ్లు మరింతగా పెరుగుదల**

- ఇండియాకు భిన్నంగా ప్రపంచ ట్రెండ్
- మద్యానికి గుడ్‌బై చెప్తున్న విదేశీయులు
- ముగ్గురిలో ఒకరు ఆల్కహాల్ ముట్టట్లేదట
- ఆరోగ్యం, డబ్బు ఆదా కోసమే ఈ నిర్ణయం
- ట్రెండింగ్‌గా మారుతున్న 'జీబ్రా స్ట్రైపింగ్'

**భారతదేశంలో మద్యం వినియోగం గత మూడు దశాబ్దాలుగా క్రమంగా పెరుగుతోంది. ఆర్థిక పురోగతి, పట్టణీకరణ, ఆదాయాల పెరుగుదల, యువతలో మారిన జీవనశైలి వంటి కారణాల వల్ల ఈ పెరుగుదల జరుగుతోంది. 2025లో కూడా ఈ ట్రెండ్ కొనసాగుతూనే ఉంది. 1990 నుంచి 2020 వరకు మద్యం వినియోగం 5-6% శాతం పెరిగింది, ముఖ్యంగా పురుషుల్లో. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ పెరుగుదల కనిపిస్తోంది. అయితే, ప్రతి వ్యక్తికి మద్యం వినియోగం (ప్యూర్ అల్కహాల్) ప్రపంచ సగటు (6.2 లీటర్లు) కంటే తక్కువగా (3.1 లీటర్లు, 2022) ఉన్నప్పటికీ, మెుత్తం మార్కెట్ పెరుగుతోంది.**



న్యూఢిల్లీ: 2024 - 2029 మధ్యకాలంలో మనదేశంలో ఆల్కహాలిక్ డ్రింక్స్ వినియోగం అదనంగా 357 మిలియన్ లీటర్లు పెరిగే అవకాశం ఉందని, ఇది ప్రపంచంలోనే అత్యధిక వృద్ధి అని నివేదిక అంచనా వేసింది. భారత్‌కు భిన్నంగా.. ప్రపంచవ్యాప్తంగా మద్యం వినియోగం తగ్గుతోంది. ముఖ్యంగా జెనరేషన్-జెడ్ (జెన్-జెడ్)లో మద్యం తాగే అలవాటు గణనీయంగా తగ్గుతోంది. చట్టబద్ధంగా మద్యం తాగే వయసున్న ప్రతీ ముగ్గురు యువకుల్లో ఒకరు (36 శాతం) ఇప్పటివరకు ఆల్కహాల్ తీసుకోలేదని ఓ గ్లోబల్ రిపోర్ట్ వెల్లడించింది. ప్రముఖ డేటా అనలిటిక్స్ సంస్థ యూరోమానిటర్ ఇంటర్నేషనల్ విడుదల చేసిన ఈ నివేదిక, మారుతున్న యువత ఆలోచనా విధానాన్ని స్పష్టం చేస్తోంది. ఆరోగ్యంగా ఉండాలనే కోరిక, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఎక్కువ మంది (87 శాతం)

- తరువాయి 2 వ పేజీలో...




## అపరిచిత నంబర్లకూ కాలర్ పేరు

**మార్చి కల్లా అందుబాటులోకి**

**మొబైల్‌లోని మన కాంటాక్ట్ లిస్ట్‌లో లేని వ్యక్తి కాల్ చేస్తే ఆ వ్యక్తి నంబర్ మాత్రమే కనిపిస్తుంది. ఒకవేళ ఆ వ్యక్తి ఎవరో తెలియాలంటే ట్రూ కాలర్ వంటి థర్డ్ పార్టీ యాప్స్‌పై ప్రస్తుతం ఆధారపడాల్సి వస్తోంది.**

న్యూఢిల్లీ: ఇకపై ఫోన్ కనెక్షన్ కోసం ఇచ్చిన గుర్తింపు కార్డులోని పేరే ఇన్‌కమింగ్ కాల్స్ సమయంలో మొబైల్ స్క్రీన్‌పై కనిపించేలా టెలికం కంపెనీలు సన్నాహాలు చేస్తున్నాయి. ప్రస్తుతం ఒక్కో సర్కిల్‌లో ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నాయి. దేశవ్యాప్తంగా వచ్చే ఏడాది మార్చి నాటికి అందుబాటులోకి రానున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాలను అరికట్టేందుకు, మోసపూరిత కాల్స్‌ను నిలువరించే ఉద్దేశంతో కాలింగ్ నేమ్ ప్రజంటేషన్ సదుపాయాన్ని టెలికం విభాగం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు తాజాగా టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ ఏకీభవించింది. ఫోన్ కనెక్షన్ కోసం ఇచ్చిన

- తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,240 |
| వెండి (గ్రాము): | రూ.166 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,471 |

## అజారుద్దీన్‌పై హస్తం ఆశలు

**అందుకే మంత్రివర్గంలో చోటు!**

**'జూబ్లీహిల్స్' గెలుపు లక్ష్యంగా పావులు**

**జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ మైనారిటీ ఓట్లపై ఆశలు పెట్టుకుంది. ఈ క్రమంలో ఇప్పటికే ఓవైసీకి చెందిన ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ పార్టీ మద్దతు కూడగట్టిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రాష్ట్ర మంత్రివర్గంలో ఒక మైనారిటీ నేతకు చోటు కల్పించాలని చూస్తోంది. మూడు రోజుల్లో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ చేపట్టేందుకు సమాయత్తమవుతోంది.**



హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): మైనారిటీ మంత్రిగా మాజీ క్రికెటర్ మహ్మద్ అజహరుద్దీన్‌కు అవకాశం కల్పిస్తారని పార్టీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మైనారిటీలు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. బీఆర్ఎస్ నేత మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్

- తరువాయి 2 వ పేజీలో...

## రాజగోపాల్‌రెడ్డికి దక్కేనా?

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): కాంగ్రెస్ మాజీ ఎంపీ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించినట్లు, శుక్రవారం ఆయన మంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, తనకు మంత్రి పదవి ఇవ్వనందుకు గత కొంతకాలంగా రాష్ట్ర హైకమాండ్‌పై ఆగ్రహంతో



ఉన్న ఆ పార్టీ నేత, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కుతుందా? లేదా? అన్నది ఆసక్తిగా మారింది. విశ్వసనీయ వర్గాల సమాచారం

- తరువాయి 2 వ పేజీలో...




## భారత్‌లో స్టార్‌లింక్ సేవలు

**నేటి నుంచి ముంబైలో డెమో**


**ప్రభుత్వ ఏజెన్సీల ముందు సామర్థ్య ప్రదర్శన**

**టెస్లా సీఈవో ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థ, భారత్‌లో తన శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను ప్రారంభించే దిశగా కీలక ముందడుగు వేసింది.**

ముంబై: దేశంలో వాణిజ్య కార్యకలాపాలు మొదలుపెట్టేందుకు అవసరమైన అనుమతుల ప్రక్రియలో భాగంగా, ముంబైలో అక్టోబర్ 30, 31 తేదీల్లో డెమో ప్రదర్శనలు నిర్వహించనుంది. భారత భద్రతా, సాంకేతిక నిబంధనలకు అనుగుణంగా తమ సేవలు ఉన్నాయని నిరూపించేందుకే ఈ డెమోలను నిర్వహిస్తున్నారు. స్టార్‌లింక్‌కు

- తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



వెన్నుపూసకు మూల కణ చికిత్స చేసి పక్షవాతం వచ్చిన వ్యక్తిని మళ్లీ ఆరోగ్యంగా, నిటారుగా నడవగలిగేలా చేశారు జపాన్ శాస్త్రవేత్తలు. ప్రపంచంలోనే ఇది తొలి చికిత్స అని తెలిపారు. ల్యాబ్‌లో అభివృద్ధి చేసిన మూల కణాలను ఓ పేషెంట్ వెన్నుపూసలోకి జొప్పించి విజయవంతంగా చికిత్స చేశారు.



## కుండపోత

**రాష్ట్రమంతా భారీ వర్షాలు**

**8 జిల్లాలకు రెడ్ అలర్ట్**

**మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను మొంథా వాయుగుండంగా బలహీనపడింది. ఆరుగంటలుగా 12 కిలోమీటర్ల వేగంతో వాయుగుండం కదులుతున్నది. భద్రాచలానికి 50 కిలోమీటర్లు, ఖమ్మంకు 100 కిలోమీటర్లు, ఒడిశా మల్కాన్‌గిరికి 130 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమైంది.**


› 2

## 4 రోజులు కీలకం

› 2

**అప్రమత్తంగా ఉండండి**

**ఏపీ మంత్రి హెచ్చరికలు**




## యూపీఐ లావాదేవీలు 143 లక్షల కోట్లు

› 2

**ఈ ఏడాది ప్రథమార్థంలో 35 శాతం వృద్ధి**

- రూ. 143.34 లక్షల కోట్ల విలువైన ట్రాన్సాక్షన్లు నమోదు
- వ్యాపారులకు చేసే చెల్లింపుల్లో 37 శాతం పెరుగుదల
- భారీగా విస్తరించిన క్యూఆర్ కోడ్, పీఓఎస్ నెట్‌వర్క్

## రాశి ఫలాలు
30.10.2025

మేషం: వ్యాపారాలు అనుకూలిస్తాయి. ఆర్థికంగా మరింత పురోగతి కలుగుతుంది. నూతన కార్యక్రమాలు చేపడతారు. ఉద్యోగమున నూతన అవకాశములు అందుతాయి. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు.

వృషభం: విద్యార్థుల ప్రయత్నాలు అనుకూలిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఆశించిన మార్పులు ఉ ంటాయి. వివాదాలకు సంభందించి విలువైన సమాచారం అందుతుంది. దైవదర్శనాలు చేసుకుంటారు. విందువినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి.

మిధునం: ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. మిత్రులతో అకారణ మాటపట్టింపులు ఉంటాయి. వృధా ఖర్చులు తప్పవు. ఉద్యోగమున అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు. కుటుంబసభ్యుల నుంచి ధనపరమైన ఒత్తిడి తప్పదు. వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి.

కర్కాటకం: వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. వృధా ఖర్చులు చేదాటుతాయి. ఉ ద్యోగయత్నాలు ముందుకు సాగతాయి. ఇంటాబయట బాధ్యతలు తప్పవు. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు.

సింహం: పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. బంధువులతో కీలక వ్యవహారాలలో చర్చలు అనుకూలిస్తాయి. వృత్తి ఉ ద్యోగాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వ్యాపారాలు మరింత అనుకూలిస్తాయి. విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

కన్య: వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. నిరుద్యోగ యత్నాలు సానుకూలమౌతాయి.ఉ ద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో సఖ్యత కలుగుతుంది.

తుల: వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. కుటుంబసభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆర్థిక సమస్యలు చికాకు పరుస్తాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత తప్పదు.

వృశ్చికం: చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. బంధువుల మాటలు మానసికంగా బాధిస్తాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు అధికమౌతాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు స్వల్ప ఆరోగ్య సమస్యలు ఉంటాయి.

ధనస్సు: కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. నూతన వాహనయోగం ఉన్నది. పాతబాకీలు వసూలవుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం కలుగుతుంది. వృత్తి, వ్యాపారాలు మరింత ఉ త్సాహంగా సాగుతాయి.

మకరం: కుటుంబసభ్యుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. చేపట్టిన పనులు మందగిస్తాయి. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. సంతాన విద్యా, ఉ ద్యోగయత్నాలు నిదానిస్తాయి. వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

కుంభం: ఉద్యోగాలలో అధికారులతో చర్చలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలలో సమస్యలు అదిగమిస్తారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుని కష్ట సుఖాలు పంచుకుంటారు. బంధు వర్గం నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

మీనం: దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారమున భాగస్థులతో వివాదాలు కలుగుతాయి. ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు తప్పవు. నూతన రుణ ప్రయత్నాలు చేస్తారు. ముఖ్యమైన పనులలో స్వల్ప అవాంతరాలు ఉంటాయి. కొన్ని పనులలో శ్రమ పడినా ఫలితం ఉండదు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి.

# రాష్ట్రమంతా భారీ వర్షాలు

### కుండపోత,, 8 జిల్లాలకు రెడ్ అలర్ట్

హైదరాబాద్/వైజాగ్, అక్టోబర్ 29 (ఈవార్తలు): మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను మొంథా వాయుగుండంగా బలహీనపడింది. ఆరుగంటలుగా 12 కిలోమీటర్ల వేగంతో వాయుగుండం కదులుతున్నది. భద్రాచలానికి 50 కిలోమీటర్లు, ఖమ్మంకు 100 కిలోమీటర్లు, ఒడిశా మల్కాన్‌గిరికి 130 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమైంది. ఉత్తర వాయవ్య దిశగా కదిలి క్రమంగా తుపాను బలహీనపడుతుందని వాతావరణశాఖ అంచనా వేసింది. వాయుగుండం నేపథ్యంలో తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. తెలంగాణలో ఒకటి, రెండు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. పలు ప్రాంతాల్లో 35-45 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని చెప్పింది. మరోవైపు, తుఫాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఇప్పటికే అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి.

వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జనం ఆందోళనకు గురవుతున్నారు. మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేసింది. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

#### రోడ్లపైకి వరద

భారీ వర్షాలకు వరంగల్- ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు చేరింది. ప్రధాన రహదారిపై వర్షం నీరు చేరటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆ రహదారిని పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు. వరంగల్‌లోని శివనగర్, మైసయ్య నగర్, ఎన్ఎన్ నగర్, లక్ష్మీగణపతి, విశ్వనాథ్ కాలనీ, కాశీబుగ్గ, వివేకానంద కాలనీ, స్టేషన్‌రోడ్, బట్టల బజార్‌లో రోడ్లపైకి వరదనీరు చేరింది. వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద నీరు బారీగా నిలిచింది. శివనగర్‌లో రహదారిపై వరద నీటితో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వరంగల్ బస్టాండ్ చెరువును తలపిస్తోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాల దృష్ట్యా హనుకొండ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సహాయక చర్యల కోసం 79819 75495 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వరంగల్ జిల్లా కల్లెడలో అత్యధికంగా 34 సెం.మీ వర్షపాతం నమోదైంది.

# తాగుడే తాగుడు

మొదటి పేజీ తరువాయి

మద్యానికి దూరంగా ఉంటున్నట్లు ఈ సర్వేలో తేలింది. వీరితో పాటు, డబ్బు ఆదా చేసుకోవడం (30శాతం), నిద్ర నాణ్యతను మెరుగుపర్చుకోవడం (25 శాతం) వంటి కారణాలు కూడా ఈ మార్పునకు దోహదపడుతున్నాయి. గత ఐదేళ్లతో పోలిస్తే మద్యం వినియోగం అలవాటు ఉన్నవారిలో కూడా మార్పు కనిపిస్తోంది. 2020లో వారానికి ఒకసారైనా మద్యం తాగేవారు 23శాతం ఉండగా, 2025 నాటికి ఆ సంఖ్య 17 శాతానికి పడిపోయింది. మద్యం అలవాటు ఉన్నవారు కూడా దాన్ని తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వీరిలో 53 శాతం మంది ఆల్కహాల్ వాడకాన్ని తగ్గించుకోవాలని చూస్తుండగా, ఐదేళ్ల క్రితం ఈ సంఖ్య 44 శాతం మాత్రమే. ముఖ్యంగా 'జీబ్రా స్ట్రైపింగ్' అనే కొత్త ట్రెండ్ యువతలో ప్రాచుర్యం పొందుతోంది. ఒకే చోట స్నేహితులతో కూర్చున్నప్పుడు ఒకసారి ఆల్కహాలిక్ డ్రింక్, మరోసారి నాన్-ఆల్కహాలిక్ డ్రింక్ తీసుకోవడాన్ని 'జీబ్రా స్ట్రైపింగ్' అంటారు. ఈ విధానం ద్వారా మద్యం వినియోగాన్ని నియంత్రించుకుంటున్నారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా నాన్-ఆల్కహాలిక్ డ్రింక్స్ మార్కెట్ మాత్రం వేగంగా వృద్ధి చెందుతోంది. 2024లో ఆల్కహాలిక్ డ్రింక్స్ మార్కెట్ కేవలం 0.6 శాతం వృద్ధి చెంది 1.7 ట్రిలియన్ డాలర్లకు చేరగా, నాన్-ఆల్కహాలిక్ స్పిరిట్స్ 17 శాతం, నాన్-ఆల్కహాలిక్ బీర్ 11 శాతం, నాన్-ఆల్కహాలిక్ వైన్ 7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. రానున్న ఐదేళ్లలో నాన్-ఆల్కహాలిక్ డ్రింక్స్ మార్కెట్ 24 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేస్తున్నారు.

# అపరిచిత నంబర్లకూ కాలర్ పేరు

మొదటి పేజీ తరువాయి

గుర్తింపు కార్డులోని పేరే కనిపించేలా చేయడానికి ట్రాయ్ అంగీకరించింది. ఒకవేళ వినియోగదారుడు తన పేరు వద్దూ అనుకుంటే ఆ పేరును డిస్‌ప్లే చేయరు. 2జీ, 3జీ వినియోగదార్లకు దీన్ని అమలు చేయడం క్లిష్టమని ట్రాయ్, డాట్ అభిప్రాయపడ్డాయి. 4జీ, అంతకుమించి సాంకేతికత ఉన్న ఫోన్లకే దీనిని వర్తింపజేయనున్నారు. ఈ ఫీచర్‌ను వొడాఫోన్, జియో సంస్థలు ప్రయోగాత్మకంగా హరియాణాలో పరీక్షిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఈ ఫీచర్‌ను టెలికం కంపెనీలు అందుబాటులోకి తీసుకొచ్చేలా డాట్ చొరవ తీసుకోనుంది. దేశవ్యాప్తంగా మార్చి 31కల్లా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు భావిస్తున్నాయి.

## రాజగోపాల్‌రెడ్డికి దక్కేనా?

మొదటి పేజీ తరువాయి

ప్రకారం.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కూడా కేబినెట్లోకి తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తద్వారా ఎన్నికలకు ముందు ఆయనకు ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలని పార్టీ ఆలోచిస్తున్నట్లు సమాచారం. తద్వారా కొన్ని రోజులుగా ఆయన వ్యక్తం చేస్తున్న అసంతృప్తిని చల్లార్చినట్లు అవుతుందని పార్టీ పెద్దలు అనుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకటి అజారుద్దీన్, మరొకటి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో భర్తీ చేస్తే మరో ఖాళీ మిగులుతుంది. ఆ ఖాళీని బీసీతో భర్తీ చేసే ఛాన్స్ ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై రేపటిలోగా క్లారిటీ వచ్చే చాన్స్ ఉంది.

## జనజీవన స్రవంతిలో మావోయిస్టులు

మొదటి పేజీ తరువాయి

లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) బెటాలియన్ నెంబర్ 1, నెంబర్లు 1, 2, 5కు చెందిన ఐదుగురు సభ్యులు, ఏరియా కమిటీ మరియు గ్రూప్‌కు చెందిన ఏడుగురు సభ్యులు ఉన్నారు. స్థానిక సంస్థ స్క్వాడ్ (ఎల్‌ఓఎస్) గ్రూప్‌కు చెందిన ముగ్గురు సభ్యులు, ఒక మావోయిస్టు గ్రూప్ కమాండర్, మావోయిస్టుల బృందానికి చెందిన 14మంది సభ్యులు, 20మంది దిగువ స్థాయి సభ్యులు ఉన్నారని బీజాపూర్ ఎస్పి తెలిపారు. 2024 జనవరి నుండి, బీజాపూర్‌లో మొత్తం 650మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో చేరారని, ఎన్‌కౌంటర్లలో 196మంది మరణించారని అన్నారు. 986మంది మావోయిస్టులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఎదుట ముగ్గురు నక్సల్స్ లొంగిపోయారు. మొత్తంగా బుధవారం ఒక్క రోజే 54 మంది నక్సల్స్ జనజీవన స్రవంతిలో కలిశారు.

# యూపీఐ లావాదేవీలు 143 లక్షల కోట్లు

### ఈ ఏడాది ప్రథమార్థంలో 35 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: భారత డిజిటల్ చెల్లింపుల రంగంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. 2025 మొదటి అర్ధభాగంలో యూపీఐ లావాదేవీల సంఖ్య గతేడాదితో పోలిస్తే 35 శాతం పెరిగి 106.36 బిలియన్లకు చేరింది. ఈ లావాదేవీల మొత్తం విలువ రూ. 143.34 లక్షల కోట్లుగా నమోదైంది. దేశంలో డిజిటల్ చెల్లింపులు ప్రజల దైనందిన జీవితంలో ఎంతగా భాగమయ్యాయో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ వివరాలను 'వరల్డ్‌లైన్' సంస్థ తన 'ఇండియా డిజిటల్ పేమెంట్స్ రిపోర్ట్ (హెచ్1 2025)'లో బుధవారం వెల్లడించింది. నివేదిక ప్రకారం యూపీఐ ద్వారా జరిగే సగటు లావాదేవీ విలువ తగ్గడం గమనార్హం. 2024 ప్రథమార్థంలో సగటున రూ. 1,478గా ఉన్న లావాదేవీ విలువ, 2025 ఇదే కాలంలో రూ. 1,348కి తగ్గింది. టీ కొట్టు, కిరాణా దుకాణం నుంచి ఆన్‌లైన్ షాపింగ్ వరకు చిన్న చిన్న, రోజువారీ కొనుగోళ్లకు ప్రజలు యూపీఐని ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఇది సూచిస్తోంది. ముఖ్యంగా వ్యక్తి నుంచి వ్యాపారికి (పీ2ఎం) చేసే లావాదేవీలు 37 శాతం వృద్ధితో 67.01 బిలియన్లకు చేరాయి. దీనికి 'కిరాణా ఎఫెక్ట్' కారణమని వరల్డ్‌లైన్ పేర్కొంది. దేశంలోని చిన్న, సూక్ష్మ వ్యాపారాలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారాయని నివేదిక తెలిపింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో భారత్‌లో ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద మర్చంట్ నెట్‌వర్క్ ఏర్పడింది. ఈ వృద్ధికి అనుగుణంగా చెల్లింపుల మౌలిక సదుపాయాలు కూడా భారీగా పెరిగాయి. దేశంలో క్యూఆర్ కోడ్‌ల సంఖ్య 2024 జనవరితో పోలిస్తే 111 శాతం పెరిగి 2025 జూన్ నాటికి 678 మిలియన్లకు చేరింది. అలాగే, పాయింట్-ఆఫ్-సేల్ (పీఓఎస్) టెర్మినళ్ల సంఖ్య 29 శాతం వృద్ధితో 11.2 మిలియన్లకు చేరుకుంది. మరోవైపు క్రెడిట్ కార్డుల వాడకం ప్రీమియం ఖర్చులకు సాధనంగా మారుతోంది. యాక్టివ్ క్రెడిట్ కార్డుల సంఖ్య 23 శాతం పెరిగింది. అయితే, చిన్న చెల్లింపులు యూపీఐ వైపు మళ్లడంతో పీఓఎస్ వద్ద డెబిట్ కార్డుల వాడకం దాదాపు 8 శాతం తగ్గింది. మొత్తం మీద మొబైల్ చెల్లింపులు 30 శాతం వృద్ధితో 98.9 బిలియన్ల లావాదేవీలను నమోదు చేశాయి. వీటి విలువ రూ. 209.7 ట్రిలియన్లుగా ఉంది.

## అజారుద్దీన్‌పై 'హస్తం' ఆశలు

మొదటి పేజీ తరువాయి



నియోజకవర్గానికి ఉపఎన్నికలు వచ్చాయి. బీఆర్ఎస్ పార్టీ గోపీనాథ్ సతీమణి సునీతకు టికెట్ ఇచ్చి సింపతీ ఓట్లను కైవసం చేసుకోవాలని చూస్తుంటే.. ఈ ఉపఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై అటు గ్రామీణ ప్రాంతాల్లో, ఇటు పట్టణ ప్రాంతాల్లో వ్యతిరేకత పెరుగుతోందని గ్రహించిన కాంగ్రెస్ నాయకత్వం, సామాజిక సమీకరణాల ద్వారా గట్టెక్కాలని చూస్తోంది. గత కొన్నాళ్లుగా తెలంగాణలో మైనారిటీలు ఎంఐఎం ఉన్నచోట ఆ పార్టీకి, ఆ పార్టీ పోటీలో లేని ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతిస్తూ వచ్చారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంఐఎంను మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. ఈ క్రమంలో కొంత సఫలీకృతమైంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిని నిలబెట్టకుండా.. పరోక్షంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించింది. ఇదిలా ఉంటే.. రాష్ట్ర మంత్రివర్గంలో అనేక వర్గాలకు చోటు కల్పించినప్పటికీ రాష్ట్రంలో గణనీయ సంఖ్యలో ఉన్న ముస్లిం మైనారిటీలకు మాత్రం ఇంతవరకు చోటు లభించలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఒక్క మైనారిటీ నేత కూడా లేకపోవడం ప్రధాన కారణం. ఆ తర్వాత ఎమ్మెల్సీగా మైనారిటీలకు అవకాశం కల్పించినప్పటికీ.. మంత్రివర్గ విస్తరణలో ఆ వర్గానికి మాత్రం చోటు కల్పించలేదు. ఈసారి జరగబోయే విస్తరణలో మైనారిటీకి చోటు కల్పిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో మహ్మద్ అజారుద్దీన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

## భారత్‌లో స్టార్‌లింక్ సేవలు

మొదటి పేజీ తరువాయి

తాత్కాలికంగా కేటాయించిన స్పెక్ట్రమ్‌ను ఉపయోగించి ఈ ప్రదర్శనలు జరపనున్నారు. గ్లోబల్ మొబైల్ పర్సనల్ కమ్యూనికేషన్ బై శాటిలైట్ ఆథరైజేషన్ కోసం అవసరమైన షరతులను పాటిస్తున్నామని ప్రభుత్వ సంస్థల ముందు స్టార్‌లింక్ నిరూపించాల్సి ఉంటుంది. ఈ డెమో విజయవంతమైతే, దేశంలో సేవలు ప్రారంభించేందుకు మార్గం సుగమం అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా స్టార్‌లింక్ 7,578 శాటిలైట్లతో అతిపెద్ద శాట్‌కామ్ ఆపరేటర్‌గా ఉంది. భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే రిలయన్స్ జియో-ఎస్ఈఎస్ జాయింట్ వెంచర్, భారతీ గ్రూప్ మద్దతున్న యూటెల్‌శాట్ వన్‌వెబ్‌లకు ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు లభించాయి. ఈ రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ప్రభుత్వం అనుమతించడంతో పోటీ మరింత పెరిగింది. దేశంలోని కొన్ని మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం ఇప్పటికీ పరిమితంగానే ఉంది. ఇలాంటి చోట్ల ఇప్పటికే ఉన్న నెట్‌వర్క్‌లకు అదనంగా శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు అందించాల్సిన అవసరం ఏర్పడింది. శాటిలైట్ నుంచి నేరుగా మొబైల్ ఫోన్‌కు సిగ్నల్ అందించే డైరెక్ట్-టు-సెల్ కమ్యూనికేషన్ టెక్నాలజీతో ఈ మార్కెట్‌కు మరింత ఆదరణ లభిస్తోంది. ఇదిలా ఉండగా, స్టార్‌లింక్ సేకరించే డేటా, ట్రాఫిక్, ఇతర వివరాలన్నీ భారత్‌లోనే నిల్వ చేయాలని, దేశీయ యూజర్ల ట్రాఫిక్‌ను విదేశాల్లోని సర్వర్లకు పంపరాదని ఈ ఏడాది ఆగస్టులోనే ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిబంధనలకు కట్టుబడి సేవలు అందించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.


## కాలేజీలు వర్సెస్ సర్కారు

మొదటి పేజీ తరువాయి

ముందు బకాయిలు విడుదల చేసి, ఆ తరువాతే తనిఖీలు చేపట్టాలని చెబుతున్నాయి. ఈ రకంగా ప్రభుత్వం తమను వేధిస్తోందని, తనిఖీలు ఆపి, పెండింగ్ బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థులు, లెక్చరర్స్, ప్రొఫెసర్స్‌తో ఛలో హైదరాబాద్ చేపట్టి, భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నాయి. అధికారులు మాత్రం ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నామని, తనిఖీలపై తాము నివేదిక ఇవ్వాల్సి ఉందని.. తమ పని తాము చేస్తామని అంటున్నారు. మరోవైపు ఎస్ఎఫ్ఐ ఈ పెండింగ్ బకాయిల విషయంలో గురువారం రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బంద్‌కు పిలునిచ్చింది.

# 4 రోజులు కీలకం.. అప్రమత్తంగా ఉండండి

### ఏపీ మంత్రి హెచ్చరికలు



అమరావతి, అక్టోబర్ 29 (ఈవార్తలు): మొంథా తుపాన్ దృష్ట్యా రాబోయే నాలుగు రోజులు చాలా కీలకమైనవని ఏపీ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కాచి వడబోసిన నీటినే తాగాలన్నారు. మొంథా తుపాన్ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టం భారీగా జరగకుండా అప్రమత్తం చేశామని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆర్టీజీఎస్‌లో కూర్చొని తుపాన్ పరిస్థితులను చంద్రబాబు ఎప్పటికప్పుడు సమీక్షించారని.. అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఢిల్లీలో కంట్రోల్ రూం ఏర్పాటు చేచసి ఎప్పటికప్పుడు సహకారం అందించారని తెలిపారు.

దీనివల్ల తుపాన్ విపత్తు నుంచి ఏపీని కాపాడుకోగలిగామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 2555 మంది గర్భిణులను ఆస్పత్రులకు తరలించి వైద్యం అందించామని మంత్రి తెలిపారు. తుపాన్ ప్రాంతాల్లో మందుల కొరత లేకుండా వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో క్లోరినేషన్ చేస్తూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో 671 అంబులెన్స్‌లు, 885 సంచార వాహనాలు (104) అందుబాటులో ఉంచామని చెప్పారు. కాగా, మొంథా తుపాన్ వల్ల జరిగిన ప్రాథమిక నష్టాన్ని ఏపీ ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రాథమికంగా 249 మండలాలు, 48 మున్సిపాలిటీల్లో 18 లక్షల మందిపై తుపాన్ ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది. వరదల కారణంగా ఇద్దరు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాలతో తుపాన్ నష్టం అంచనా ప్రక్రియను అధికారులు కొనసాగిస్తున్నారు. కాగా, మొంథా తుపాన్ కారణంగా భారీ వర్షాల కారణంగా పలు జిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పంట నష్టంపై అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. జిల్లాల్లో భారీగా పంటలు దెబ్బతిన్నాయని చెప్పుకొచ్చారు. 10 వేల హెక్టార్లలో వరిపంట దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. 5 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం కలిగినట్లు గుర్తించారు. రెండు వేల ఎకరాల్లో రొయ్యల చెరువులు నీట మునిగాయని అధికారులు తెలిపారు. కాగా, రెండు రోజుల్లో ఈ ప్రాథమిక నివేదికను పూర్తి చేసి ఏపీ ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు. ప్రాథమిక అంచనాలు వచ్చాక కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించనుంది.



## హరీశ్‌రావుకు బండి సంజయ్ పరామర్శ

కోకాపేట/హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తండ్రి సత్యనారాయణరావు పరమపదించిన నేపథ్యంలో పలువురు ప్రముఖులు, నేతలు, అభిమానులు ఆయన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బుధవారం సాయంత్రం కోకాపేటలోని హరీష్‌రావు నివాసానికి వెళ్లి పరామర్శించారు. సత్యనారాయణరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. హరీష్‌రావు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## కరీంనగర్‌లో వైద్యుడి ఆత్మహత్య

**అధిక మోతాదులో మత్తు తీసుకొని సూసైడ్**

**స్నేహితులకు అప్పిచ్చి మోసపోయానని మనోవేదన**

**ఇద్దరు మిత్రులకు రూ.1.78 కోట్లు అప్పిచ్చిన డాక్టర్ శ్రీనివాస్**

కరీంనగర్, అక్టోబర్ 29 (ఈవార్తలు): కరీంనగర్ లో స్నేహితులను నమ్మి అప్పిస్తే తిరిగివ్వకుండా ముఖం చాటేయడంతో యువ వైద్యుడు ఒకరు బలవన్మరణానికి పాల్పడ్డాడు. తను అప్పు ఇవ్వడమే కాకుండా తన పేరుతో బ్యాంకులో కూడా రుణం ఇప్పించాడా వైద్యుడు.. స్నేహితులు మోసం చేయడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమై చివరకు తన ప్రాణం తీసుకున్నాడు. బాధిత కుటుంబం, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ మంకమ్మతోటకు చెందిన వైద్యుడు ఎంపటి శ్రీనివాస్(43) నగర శివార్లలోని ఓ మెడికల్ కాలేజీలో ఎనస్తీషియా విభాగంలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్నారు. శ్రీనివాస్ భార్య విప్లవశ్రీ ప్రభుత్వ వైద్యురాలు. వారికి ఒక కుమారుడు. శ్రీనివాస్ తన స్నేహితులు ఇద్దరికి రూ.1.78 కోట్లు అప్పుగా ఇచ్చాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని సాయం కోరిన మరో ముగ్గురు స్నేహితులకు బ్యాంకులో తన పేరుమీద రూ.1.35 కోట్ల లోన్ ఇప్పించాడు. అప్పు తీసుకునేటపుడు అంతా బాగానే ఉంది కానీ తిరిగి చెల్లించే విషయంలో స్నేహితులు ముఖం చాటేశారు. మిత్రులు ఎంతకూ తన డబ్బు తిరిగివ్వకపోవడంతో శ్రీనివాస్ మనోవేదనకు గురయ్యాడు. ఇదే విషయమై తన వద్ద పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశాడని శ్రీనివాస్ భార్య విప్లవశ్రీ తెలిపారు. ఈ ఆందోళనతో తన భర్త అనారోగ్యం పాలయ్యాడని, వారం రోజులుగా మానసిక వేదనకు గురవుతున్నాడని ఆమె చెప్పారు.

# కారు వర్సెస్ బుల్డోజర్

**అభివృద్ధి కారు కావాలా?... ఇండ్లు కూల్చే బుల్డోజర్ కావాలా?**

**కాంగ్రెస్ పైసలిస్తే తీసుకోండి**

**ఓటు మాత్రం బీఆర్ఎస్‌కు వేయండి**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): రాష్ట్రంలో పాలన పడకేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన ప్రభుత్వం, మంత్రుల తీరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని మండిపడ్డారు. రైతులు పండించిన ధాన్యం, పత్తి కొనుగోలు చేసే పరిస్థితే లేదని చెప్పుకొచ్చారు. అన్నదాతలకు బోనస్, పెట్టుబడి సాయం, విత్తనాలు, ఎరువులు కూడా అందట్లేదని.. ఎరువుల కోసం లైన్‌లో నిలబడి రైతు చనిపోయిన దుస్థితి రాష్ట్రంలో నెలకొందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రూ.73వేల కోట్లు రైతుబంధు రూపంలో రైతుల అకౌంట్లు వేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదైతే.. ఆ రైతుల గోస పట్టించుకోని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగులను సీఎం రేవంత్ రెడ్డి నిట్టనిలువునా మోసం చేశారు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. మొత్తం మీద ఇప్పటి వరకు ఇచ్చినవి ఆరు, ఏడు వేల ఉద్యోగాలు కూడా లేవని ఎద్దేవా చేశారు. దీనిపై మంత్రులు అబద్ధాలు చెబుతున్నారని.. కానీ వారు కూడా ఒకరికి ఒకరు పొంతన లేని నెంబర్లు చెబుతున్నారంటూ సెటైర్లు వేశారు. యువతులకు స్కూటీ, మహిళలకు నెలకు రూ.2500, తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ మాట తప్పిందంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రీ బస్ పేరు చెప్పి.. ఆ డబ్బులు పురుషుల నుంచి లాక్కుంటున్నారని గుర్తుచేశారు. పదే పదే ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్.. ఆ ఇందిరమ్మ రాజ్యంలో ఒక్క ఇల్లు కూడా కట్టకపోగా.. వేలాది ఇళ్లను నేలమట్టం చేసిందని ఆయన మండిపడ్డారు. పెద్దల ఇండ్ల జోలికి వెళ్లని హైడ్రా.. పేదల ఇల్లు కనిపిస్తే కూల్చివేస్తోందంటూ మండిపడ్డారు. మంత్రులు జూబ్లీహిల్స్‌లో గల్లీ లీడర్లలా తిరుగుతూ.. పాలనను పక్కన పెట్టేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఇకపోతే మున్నూరు కాపులకు కేసీఆర్ ఎంతో చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. మున్నూరు కాపులకు సముచిత గౌరవం, సముచిత ప్రాధాన్యం ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటూ బీసీలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని మండిపడ్డారు.పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేస్తేనే ఇది జరుగుతుందని తాము ముందే చెప్పినా... ఈ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందంటూ ఆగ్రహం వ్యకతం చేశారు. కనీసం ఎన్నికలకు ముందు బీసీలకు ఇచ్చిన హామీలనైనా అమలు చేయాలని...బీసీలకు ఏడాదికి రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్ల బడ్జెట్ ఇస్తామని చెప్పి ఇప్పుడెందుకు ఇవ్వట్లేదో చెప్పాలని నిలదీశారు. బీసీలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాల్సిందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబితేనే వారిచ్చిన హామీలు అమలవుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌ను గెలిపించి కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలను నమ్మవద్దని హితవుపలికారు. రెండేళ్ల కిందట ఇలాంటి హామీలనే నమ్మి ప్రజలు మోసపోయారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా ప్రజలకు డబ్బులు ఇచ్చి ఓట్లు కొనుగోలు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. పైసలు ఇస్తే తీసుకొని ఓటు మాత్రం బీఆర్ఎస్‌కు వేయాలని సూచించారు. వారిచ్చే రెండు వేలు తీసుకొని.. మిగితా 58వేలు ఎప్పుడిస్తారని ప్రశ్నించాలంటూ ప్రజలకు సూచించారు. మరోవైపు దొంగ ఓట్లతో అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇప్పటికే కాంగ్రెస్ 12, 13వేల దొంగ ఓట్లు సృష్టించినట్లు తెలుస్తోందని.. ప్రజలు స్వయంగా బూత్‌లకు వెళ్లి ఓటు వేసి.. వాళ్లకు బుద్ధి చెప్పాలని అన్నారు. ఇది కారుకు బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నికలన్న ఆయన బీఆర్ఎస్‌ను గెలిపించి.. బుల్డోజర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని జూబ్లీహిల్స్ ప్రజలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు.







# అధికారులూ.. అప్రమత్తం!

**సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు.. రైతులకు నష్టం జరగవద్దని సూచన**

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): మొంథా తుపాను తీవ్ర వాయుగుండంగా మారి రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వాయుగుండం ప్రభావంపై ముఖ్యమంత్రి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుని, వారికి దిశానిర్దేశం చేశారు. వరి కోతల సమయం కావడంతో పాటు పలు చోట్ల కళ్లాల్లో ధాన్యం ఆరబోసిన నేపథ్యంలో రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో మొంథా తుపాను ప్రభావం అధికంగా ఉండగా, హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు దారిమళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. తుపాను ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని, జిల్లా కలెక్టర్లు ఆయా బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండి, లోతట్టు ప్రాంతాల కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లకు మరియు క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లో లెవల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలను పూర్తిగా నిషేధించాలని, పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తుపాను ప్రభావంతో వర్షపు నీరు నిలువ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించే అవకాశం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులను అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం, పశునష్టం చోటుచేసుకోకుండా శాఖలు జాగ్రత్తలు వహించాలన్నారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

# నల్లగొండలో మూసీ ఉగ్రరూపం

**నిండుకుండలా మారిన మూసీ ప్రాజెక్టు.. ఏడు గేట్లు ఎత్తి 20 వేల క్యూసెక్కుల నీటి విడుదల**

**దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు**

**జూలూరు-రుద్రవెల్లి వద్ద బ్రిడ్జిపై వరద ప్రవాహం.. పోచంపల్లి-బీబీనగర్ మధ్య నిలిచిపోయిన రాకపోకలు**

నల్లగొండ, అక్టోబర్ 29 (ఈవార్తలు): ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు నల్లగొండ జిల్లాలో మూసీ నది ఉగ్రరూపం దాల్చింది. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో కేతేపల్లి మండలంలోని మూసీ ప్రాజెక్టు నిండుకుండలా మారింది. దీంతో అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టు ఏడు గేట్లను పైకెత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో 3, 4, 5, 6, 8, 10, 12 నంబర్ల క్రస్ట్ గేట్లను 4 అడుగుల మేర ఎత్తి, 20 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు వెల్లడించారు. నీటి విడుదలతో మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. నదిలోకి ఎవరూ వెళ్లవద్దని, పశువులను కూడా నది వైపు తీసుకెళ్లవద్దని సూచించారు. మరోవైపు మూసీ ఉధృతి కారణంగా పలుచోట్ల రవాణాకు అంతరాయం ఏర్పడింది. జూలూరు-రుద్రవెల్లి వద్ద ఉన్న లో-లెవల్ బ్రిడ్జిపై నుంచి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోచంపల్లి-బీబీనగర్ మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీబీనగర్, భువనగిరి వెళ్లాల్సిన వాహనదారులు పెద్ద రావులపల్లి మీదుగా చుట్టూ తిరిగి ప్రయాణిస్తున్నారు. అధికారులు ముందుజాగ్రత్త చర్యగా బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంఆర్ఐ గుత్తా వెంకట్ రెడ్డి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, మూసీ నది సమీప ప్రాంతాల్లో సంచరించవద్దని వారు విజ్ఞప్తి చేశారు.



## హైదరాబాద్‌ను ముంచెత్తిన వాన

హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): హైదరాబాద్ వాసులు ఈ ఉదయం భారీ వర్షంతో నిద్రలేచారు. నగరంలోని పలు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచే కుండపోతగా వర్షం కురుస్తోంది. ఇదిలా ఉండగా, రానున్న గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ఈ మేరకు తెలంగాణకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అడపాదడపా ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఐఎండీ సైతం నగరంలో మోస్తరు వర్షాలతో పాటు బలమైన గాలులు వీస్తాయని తెలిపింది. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు ఉదయం పూట పొగమంచు లేదా మబ్బులతో కూడిన వాతావరణం ఉంటుందని వెల్లడించింది. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణాలు చేసేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఏసీబీకి చిక్కిన లైన్ ఇన్‌స్పెక్టర్

**ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్‌కు లంచం డిమాండ్**

**6,000 లంచం తీసుకుంటుండగా అరెస్ట్**

పెద్ద అంబర్‌పేట/హైదరాబాద్, అక్టోబర్ 29 (ఈవార్తలు): నగరంలో ఓ అవినీతి అధికారి... అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. కొత్త విద్యుత్ కనెక్షన్ మంజూరు చేసేందుకు రూ.6,000 లంచం తీసుకుంటుండగా విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్ శివారు పెద్ద అంబర్‌పేట్‌లోని సహాయక ఇంజనీర్ (ఆపరేషన్స్) కార్యాలయంలో ప్రభు లాల్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఒక ప్రైవేట్ కళాశాల ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌కు 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, కొత్త మీటర్లు ఏర్పాటు చేశారు. వీటికి సర్వీస్ నంబర్లు కేటాయించేందుకు ప్రభు లాల్, ఫిర్యాదుదారుడి నుంచి రూ.6,000 లంచంగా డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు, బుధవారం ఫిర్యాదుదారుడి నుంచి ప్రభు లాల్ లంచం డబ్బులు తీసుకుంటుండగా, ముందుగా వేసిన పథకం ప్రకారం అధికారులు అతడిని పట్టుకున్నారు. రసాయన పరీక్షల్లో అతని చేతులు గులాబీ రంగులోకి మారడంతో లంచం తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. లంచం డబ్బును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం డిమాండ్ చేస్తే తమ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. వాట్సాప్ (9440446106) లేదా ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

## కోతకు గురైన జాతీయ రహదారి

**నాగర్ కర్నూలు జిల్లాలో ఘటన**

నాగర్ కర్నూలు, అక్టోబర్ 29 (ఈవార్తలు): మొంథా తుపాను వాయుగుండంగా బలహీనపడటంతో తెలంగాణపై దీని ప్రభావం కొనసాగుతోంది. భద్రాచలానికి 50 కి.మీ., ఖమ్మంకు 110 కి.మీ., ఒడిశాలోని మల్కన్‌గిరికి 130 కి.మీ. దూరంలో ఇది కేంద్రీకృతమై ఉంది. గడిచిన ఆరు గంటలుగా వాయుగుండం 12 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. ఉత్తర వాయవ్య దిశగా కదిలి క్రమంగా బలహీనపడనుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని కారణంగా రాగల 12 గంటల్లో తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. తెలంగాణలోని ఒకటి రెండు ప్రాంతాల్లో ఆకస్మిక వరద హెచ్చరికలను విశాఖ వాతావరణ కేంద్రం జారీ చేసింది. నాగర్ కర్నూలు జిల్లా ఉప్పునుంతల మండలం లతిపూర్ సమీపంలో డిండి జలాశయం మత్తడి దుంకుతోంది. దీంతో జాతీయ రహదారి కోతకు గురి కావడంతో అధికారులు బుధవారం సాయంత్రం నుంచి రాకపోకలను నిలిపివేశారు. శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్లవలసిన వాహనాలను అచ్చంపేట మండలంలోని హాజీపూర్ నుంచి వంగూరు మండలం చింతపల్లి, కొండారెడ్డిపల్లి మీదుగా మళ్లించారు. కోతకు గురైన జాతీయ రహదారిని నాగర్ కర్నూలు ఎస్పీ పరిశీలించారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థకు అధికారులు సమాచారం అందించారు.

## నిజాంపేట పార్కులకు హైడ్రా విముక్తి

**రూ.39 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా**

నిజాంపేట, అక్టోబర్ 29 (ఈవార్తలు): నిజాంపేట మున్సిపాలిటీ పరిధిలో కబ్జాకు గురైన రెండు ప్రభుత్వ పార్కులను హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం చర్యలు చేపట్టి, సుమారు రూ.39 కోట్ల విలువైన 2,600 గజాల స్థలాన్ని కాపాడారు. వివరాల్లోకి వెళితే, నిజాంపేటలోని బృందావన్ కాలనీలో 2,300 గజాల పార్కు, కౌశల్యా కాలనీలోని 300 గజాల 'బనియన్ ట్రీ పార్కు' కొంతకాలంగా ఆక్రమణలో ఉన్నాయి. కబ్జాదారులు పార్కు ప్రహరీని కూల్చివేసి, పిల్లల ఆటవస్తువులను ధ్వంసం చేసి, పార్కు బోర్డులను తొలగించారు. సర్వే నంబర్ 93లోని ఈ పార్కు స్థలాన్ని, సర్వే నంబర్ 94కు చెందినదిగా తప్పుగా చూపిస్తూ కబ్జాకు పాల్పడ్డారు. దీనిపై బృందావన్ కాలనీ వాసులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఈ భూములు పార్కులకే చెందినవని నిర్ధారించుకున్న తర్వాత ఆక్రమణలను తొలగించి, స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. పార్కులను కాపాడినట్లు సూచిస్తూ అధికారిక బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. తమ పార్కు స్థలాలు తిరిగి దక్కడంతో బృందావన్ కాలనీ వాసులు, చిన్నారులు ఆనందం వ్యక్తం చేశారు. 'థ్యాంక్యూ హైడ్రా' అంటూ ప్లకార్డులు ప్రదర్శించి, ప్రభుత్వానికి, హైడ్రా అధికారులకు అనుకూలంగా నినాదాలు చేశారు. తమ ఫిర్యాదుపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. నగరంలో చెరువులు, పార్కులు, ఇతర ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రా 2024 నుంచి ఆక్రమణల తొలగింపు చర్యలను ముమ్మరం చేసిన విషయం తెలిసిందే.

## భారత్‌లో ప్రయాణికుల విమానాల తయారీ

**రష్యా సహకారంతో 'హాల్' కీలక ఒప్పందం**

న్యూఢిల్లీ: భారత వైమానిక రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి తెరలేవబోతోంది. దేశంలోనే తొలిసారిగా పూర్తిస్థాయి ప్రయాణికుల విమానాల తయారీకి రంగం సిద్ధమైంది. రష్యాకు చెందిన ప్రముఖ సంస్థ యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ (యూఏసీ) సహకారంతో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టనుంది. ఇందుకు సంబంధించి ఇరు సంస్థల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం, రష్యాకు చెందిన ఎస్ఎస్‌జే-100 విమానాలను భారత్‌లో తయారు చేయనున్నారు. ట్విన్ ఇంజన్, నేరో బాడీ కలిగిన ఈ విమానాలు దేశీయంగా విమానయాన సేవలను మరింత విస్తృతం చేయనున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఉడాన్' పథకానికి ఈ విమానాల తయారీ భారీ ఊతాన్ని ఇస్తుందని హాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. టైర్-2, టైర్-3 నగరాల మధ్య ప్రాంతీయ అనుసంధానాన్ని పెంచే లక్ష్యంతో కేంద్రం 2016లో ఉడాన్ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. యూఏసీ వెబ్‌సైట్ ప్రకారం, ఎస్ఎస్‌జే-100 విమానం చిన్న పరిమాణంలో, 103 మంది ప్రయాణికుల సామర్థ్యంతో ఉంటుంది. ఇది సుమారు 3,530 కిలోమీటర్ల పరిధిలోని స్వల్ప దూర ప్రయాణాలకు అత్యంత అనుకూలమైనది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 16 విమానయాన సంస్థలు 200కు పైగా ఎస్ఎస్‌జే-100 విమానాలను నడుపుతున్నాయి. రష్యా నుంచి భారత్ ముడి చమురును దిగుమతి చేసుకుంటున్నందుకు అమెరికా అదనపు సుంకాలు విధిస్తున్న తరుణంలో, ఇరు దేశాల మధ్య ఈ కీలక రక్షణ, పారిశ్రామిక ఒప్పందం జరగడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

## 1000 మందికి అమెజాన్ ఉద్వాసన!

**భారత్‌లో ఉద్యోగాల కోతకు రెడీ అయిన ఈకామర్స్ సంస్థ**

**మొత్తంగా 14,000 మందిని తొలగించనున్నట్లు ప్రకటన**

న్యూఢిల్లీ: ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ ప్రపంచవ్యాప్తంగా వేలాది ఉద్యోగులను తొలగించనున్న విషయం విదితమే. ఇందులో భాగంగా, భారత్‌లో 800 నుంచి 1,000 మంది వరకు ఉద్యోగులను తొలగించే అవకాశం ఉంది. తన కార్పొరేట్ విభాగంలో ప్రపంచవ్యాప్తంగా 14 వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. భారత్‌లోనూ తొలగింపులు ఉండనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఫైనాన్స్, మార్కెటింగ్, మానవ వనరులు, టెక్ విభాగాల్లో ఈ తొలగింపులు ఉండవచ్చని భావిస్తున్నారు. అమెజాన్ సీఈవోగా ఆండీ జాస్సీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కంపెనీలో లేఆఫ్‌లు అధికమయ్యాయి. జనరేటివ్ ఏఐ వల్ల రాబోయే కొన్నేళ్లలో తమ కార్పొరేట్ సిబ్బంది సంఖ్య తగ్గొచ్చని గతంలో ఆయన స్వయంగా వెల్లడించారు. 2023 మార్చిలో 9 వేల మందిని, ఆ తర్వాత రెండు నెలలకు 18,000 మందిని తొలగించింది. ఆ తొలగింపులో భారత్‌లో 500 మంది ఉద్యోగాలు కోల్పోయారు.



## వేములవాడలో ఆటోమేటిక్ సీసీకెమెరాల ఏర్పాటు

**ప్రారంభించిన ఎస్పీ మహేశ్ బీ గితే**

వేములవాడ, అక్టోబర్ 29 (ఈవార్తలు): వేములవాడ పట్టణ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణను బలోపేతం చేస్తూ, వాహనాలను ఆటోమేటిక్‌గా గుర్తించే ఆధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని 5 కీలక ప్రాంతాల్లో ఈ కెమెరాలను అమర్చారు. వీటిని అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డితో కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బీ గితే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేములవాడ పట్టణ పరిధిలోని కోరుట్ల బస్టాండ్, సాయిరక్ష చౌరస్తా, ఓల్డ్ బిడ్జి, తిప్పాపూర్ బస్టాండ్, కరీంనగర్ నుంచి వచ్చే దారి, సిరిసిల్ల నుండి వచ్చే దారిలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కెమెరాల ద్వారా పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనాలు, ర్యాష్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాల నంబర్ ప్లేట్స్ ఆటోమేటిక్‌గా స్కాన్ చేసి సంబంధిత వాహనాల యజమానులకు జరిమానా విధిస్తామని తెలిపారు. వేములవాడ పట్టణానికి చెందిన ప్రజలు, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు పట్టణ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు రామ్మోహన్, రూరల్ ఎస్సై వెంకట్రాజం, ఎల్లగౌడ్, రాజు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## వేములవాడ సర్కారు దవాఖానకు రూ.కోటి పరికరాలు

**హర్షం వ్యక్తం చేసిన బీజేపీ నేతలు.. బండి సంజయ్‌కు కృతజ్ఞతలు**

వేములవాడ, అక్టోబర్ 29 (ఈవార్తలు): వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సేవలపై బిజెపి నేతలు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి వర్యులు బండి సంజయ్ సహకారంతో రూ.కోటి సీఎస్ఆర్ నిధుల నుంచి ఆసుపత్రికి వివిధ పరికరాలను అందించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ చెన్నమనేని వికాస్ రావు వాటిని పరిశీలించి మాట్లాడుతూ.. రాజకీయాలు ఎన్నికల వరకే ఉంటాయని, ప్రజలకు అభివృద్ధి చేయడమే బీజేపీ పార్టీ సిద్ధాంతమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఆసుపత్రికి అందించిన వివిధ పరికరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దీనికి సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు రాపల్లి శ్రీధర్, అల్లాడి రమేష్, సిరికొండ శ్రీనివాస్, రేగుల సంతోష్ బాబు తో పాటు వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు బిజెపి నాయకులు కార్యకర్తలుపాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మల్యాల, అక్టోబర్ 29 (ఈవార్తలు): మొంథా తుపాన్ తీవ్రత దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు మల్యాల పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే మల్యాల మండలంలోని గ్రామాలలోని చెరువులు, కుంటలు నిండుకుండాలా ఉన్నాయని, చెరువులు మత్తడి పొసే అవకాశం, వాగులు పొంగే పరిస్థితులు ఉన్నాయన్నారు. మత్తడి, వాగులు దాటే ప్రయత్నం చేయొద్దని,రోడ్డుపై వెళ్లేటప్పుడు గుంతలు గమనించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని మల్యాల పోలీస్ స్టేషన్ ఎస్సై నరేశ్ కుమార్ పేర్కొన్నారు.

## 'మొంథా' పరిస్థితుల పరిశీలన

శ్రీకాకుళం, అక్టోబర్ 29 (ఈవార్తలు): మొంథా తుఫాన్ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లాలోని జీ సిగడాం మండలం పరిధి బాతువ గ్రామంలో పరిస్థితులను స్థానిక నాయకులతో కలిసి అధికారులు సమీక్షించారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చందక సూర్యారావు, కూనిబెల్లి కూర్మారావు అధికారులతో కలిసి గ్రామంలోని పలు వీధుల్లో తిరిగి పరిస్థితి పరిశీలించారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని, ప్రజలకు అండగా తమ ఉన్నామని సూర్యారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



# మొంథా మృతులకు 5 లక్షలు

## తుఫాను బాధితులకు తక్షణ సాయం.. సమీక్షలో ఏపీ సీఎం కీలక ఆదేశాలు

అమరావతి, అక్టోబర్ 29 (ఈవార్తలు): మొంథా తుఫాను సృష్టించిన బీభత్సం నుంచి ప్రజలను, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. పంట నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలతో ఐదు రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది వేగంగా నష్టాన్ని అంచనా వేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, తుఫాను కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. బుధవారం ఉదయం తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్న ముఖ్యమంత్రి, సాయంత్రం సచివాలయంలోని ఆర్టీజీ కేంద్రంలో ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయక, పునరుద్ధరణ చర్యలపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అధికారులు తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 304 మండలాల్లోని 1,825 గ్రామాల్లో సుమారు 87 వేల హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని తెలిపారు. ఇందులో 59 వేల హెక్టార్లకు పైగా వరి పంట నీట మునిగిందని, ప్రత్తి, మొక్కజొన్న, మినుము వంటి ఇతర పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 78,796 మంది రైతులు నష్టపోయారని, 42 పశువులు కూడా మృత్యువాత పడ్డాయని వివరించారు. అయితే ఇది కేవలం ప్రాథమిక అంచనా మాత్రమేనని, క్షేత్రస్థాయిలో వాస్తవ నష్టం ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, వ్యవసాయ శాస్త్రవేత్తలు వెంటనే దెబ్బతిన్న పొలాలను సందర్శించి, పంటలను కాపాడుకునే మార్గాలపై రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని నిర్దేశించారు. సహాయక చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్న చంద్రబాబు, విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. బుధవారం రాత్రికి అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని, గురువారం నాటికి దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు పూర్తి చేయాలని గడువు విధించారు. ఈ పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఎస్ ఆర్టీసీ బస్సు సర్వీసులను యథావిధిగా కొనసాగించాలని సూచించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ.. కూలిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నామని, ఫీడర్లను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు.

### భారీ ఎత్తున సహాయక చర్యలు

మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని 249 మండలాలు, 1,434 గ్రామాలు, 48 మున్సిపాలిటీల్లోని దాదాపు 18 లక్షల మంది ప్రజలు ప్రభావితమయ్యారు. ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా 1,209 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, 1.16 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. తుఫాను కారణంగా రాష్ట్రంలో 380 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రహదారులు, 14 వంతెనలు, కల్వర్టులు దెబ్బతినడంతో రూ. 4.86 కోట్ల నష్టం వాటిల్లింది. అలాగే 2,294 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రోడ్లకు రూ. 1,424 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా. గ్రామీణ నీటి సరఫరా విభాగానికి రూ. 36 కోట్లు, జలవనరుల శాఖకు రూ. 16.45 కోట్ల నష్టం జరిగింది. సహాయక చర్యల్లో భాగంగా 3,175 మంది గర్భిణీలను ఆసుపత్రులకు తరలించగా, 2,130 వైద్య శిబిరాలు నిర్వహించారు. రహదారులపై విరిగిపడిన 380 చెట్లను తొలగించి రవాణాకు అంతరాయం లేకుండా చేశారు. తుఫాను తీరం దాటడంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయని, ప్రభుత్వ చర్యలపై ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తమవుతోందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



### ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి.. కలెక్టర్‌పై అసహనం

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని, ఎక్కడా నీరు నిలిచిపోకుండా డ్రైనేజీలను శుభ్రపరచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న ప్రతి కుటుంబానికి గురువారం నాటికల్లా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేయాలని స్పష్టం చేశారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా రూరల్ వాటర్ సప్లయ్ అధికారులు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఒంగోలు పట్టణంలోని పలు కాలనీలు నీట మునగడంపై ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు పనితీరుపై ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పాలనా వైఫల్యాలు పునరావృతం కావొద్దని, విపత్తుల నిర్వహణలో పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. ప్రతి జిల్లా ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు.

# ఒక్కో వ్యక్తికి రూ.1000

## కుటుంబానికి గరిష్ఠంగా రూ.3000
## తుఫాను బాధితులకు ఏపీ సర్కారు ఆర్థికసాయం

అమరావతి, అక్టోబర్ 29 (ఈవార్తలు): మొంథా తుఫాను కారణంగా నిరాశ్రయులైన బాధితులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. తుఫాను ప్రభావంతో పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న వారికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్రాల్లో ఉన్న ప్రతి వ్యక్తికి రూ.1,000 చొప్పున, ఒక కుటుంబానికి గరిష్ఠంగా రూ.3,000 వరకు నగదు అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయంపై విపత్తు నిర్వహణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. పునరావాస కేంద్రాల నుంచి బాధితులు తమ ఇళ్లకు తిరిగి వెళ్లే సమయంలో ఈ నగదును నేరుగా అందించాలని స్పష్టం చేశారు. మూడు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులు ఉన్న కుటుంబాలకు రూ.3,000 సాయం అందుతుంది. ఈ తక్షణ సాయం బాధితుల రోజువారీ అవసరాలకు, అత్యవసర ఖర్చులకు ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. కోస్తాంధ్రను మొంథా తుఫాను అతలాకుతలం చేసిన విషయం తెలిసిందే. భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం ఇప్పటికే ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పిస్తోంది. తాజాగా ప్రకటించిన ఆర్థిక సాయం బాధితులకు కొంత ఊరట కలిగించే అంశం. అయితే ఇది కేవలం తక్షణ సాయం మాత్రమేనని, ఆస్తి నష్టానికి సంబంధించి పూర్తిస్థాయి పరిహారం అందించాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. బాధితులు తమ స్థానిక అధికారుల ద్వారా ఈ సాయం పొందవచ్చని అధికారులు సూచించారు. తుఫాను ప్రభావిత ప్రజలు తిరిగి సాధారణ జీవితం గడిపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. బాధితుల పూర్తి వివరాలు, పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను అధికారులు వేగవంతం చేస్తున్నారు.



## ఆక్రమణలో 100 కోట్ల ఆస్తి

**మాజీమంత్రి జీవన్ రెడ్డి ఆరోపణ**

జగిత్యాల టౌన్, అక్టోబర్ 29 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని రూ.100 కోట్ల విలువైన ఆస్తిపై కబ్జా రాయుళ్లు కన్నేసినట్లు మాజీమంత్రి జీవన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాధ్యతగల పౌరుడిగా భూ ఆక్రమణను వెలుగులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. కిబాల ద్వారా పెట్రోలు బంకు నిర్వాహణ కోసం మాత్రమే అప్పగిస్తే వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేసుకున్నారని మండిపడ్డారు.. భూ వివాదం ఈనాటిది కాదని, 1964 నుండి భూ వివాదం కొనసాగుతోందన్నారు. యాజమాన్య హక్కులు మున్సిపాలిటీకి ఉన్నాయి కాబట్టి చట్టపరంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.



## ధాన్యం కొనుగోళ్ల సమస్యలకై కాల్ సెంటర్

**కాల్ సెంటర్ ప్రారంభించిన కలెక్టర్ సత్యప్రసాద్**

జగిత్యాల టౌన్, అక్టోబర్ 29 (ఈవార్తలు): వరి ధాన్యం కొనుగోళ్లలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్లో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో ధాన్యం కొనుగోళ్ల లో ఎదురయ్యే సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ను బుధవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్, టోల్ ఫ్రీ నంబర్ 18004258187కు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సంప్రదించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఎస్వో జితేందర్ రెడ్డి, డీఎం జితేంద్ర ప్రసాద్ మరియు సంబంధిత అధికారులు,కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాలు.. విద్యుత్తుతో జాగ్రత్త

**జగిత్యాల ఎస్ఈ సుదర్శనం**



జగిత్యాల టౌన్, అక్టోబర్ 29 (ఈవార్తలు): మొంథా తుఫాను నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ బీ సుదర్శనం తెలిపారు. భారీ వర్షాల వల్ల విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని, విద్యుత్ వినియోగదారులంతా అత్యంత అప్రమత్తతతో ఉండి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**విద్యుత్ భద్రత కోసం పాటించవలసిన సూచనలు:**

- వర్షాలు పడుతున్న సమయంలో, లేదా తడి ప్రదేశాల్లో తడిగా ఉన్న చేతులతో స్విచ్‌లు, మీటర్లు, ప్లగ్‌లు లేదా వైర్లు తాకకండి.
- ఎక్కడైనా తెగిపోయిన విద్యుత్ తీగలు కనిపించినప్పుడు వాటి దగ్గరికి వెళ్లకుండా, వెంటనే మీ సమీప లైన్‌మన్‌కి లేదా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కి సమాచారం ఇవ్వండి.
- తక్కువ ఎత్తులో వెళ్లే విద్యుత్ తీగల కింద వాహనాలు నడపకండి, పశువులను తీసుకెళ్లకండి.
- పిల్లలను విద్యుత్ పరికరాల దగ్గర ఆడనీయకుండా దూరంగా ఉండేటట్లు చూడాలి
- పొలాల్లో లేదా బోర్‌వెల్‌ల వద్ద పనిచేసే సమయంలో తడి నేలపై నిలబడి విద్యుత్ మోటార్ స్విచ్‌లు ఆన్/ఆఫ్ చేయకండి.
- విద్యుత్ పరికరాల్లో తడినీరు ఉంటే వాటిని వినియోగం నుండి తొలగించండి
- వరద ప్రభావిత ప్రాంతాల్లో నీటిలో మునిగిన విద్యుత్ పరికరాలనుతాకకండి



## స్కాలర్‌షిప్ కోసం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

జగిత్యాల టౌన్, అక్టోబర్ 29 (ఈవార్తలు): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు దిష్టిబొమ్మను శవయాత్రగా నిర్వహించి పట్టణంలోని తహసీల్ చౌరస్తా వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సునీల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని, విద్యార్థులకు రావలసిన ఫీజు 8,500 కోట్లను పెండింగ్ లో పెట్టిందని తద్వారా విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లాలంటే కళాశాల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని అన్నారు. పేద విద్యార్థుల దగ్గరి నుండి ఫీజులు వసూలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## పట్టుబడ్డ అంతర్రాష్ట్ర దొంగలు

**వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ**



జగిత్యాల రూరల్, అక్టోబర్ 29 (ఈవార్తలు): అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలోని ప్రధాన నిందితుడు అనిల్‌ను జగిత్యాల గ్రామీణ పోలీసులు పట్టుకున్నారు. గత వారం ముఠాలోని ముగ్గురు దొంగలను పట్టుకోగా, ప్రధాన నిందితుడు పారిపోయాడు. ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టిన పోలీసులు.. ఎట్టకేలకు బుధవారం అతడిని అరెస్టు చేశారు. మహారాష్ట్రతోపాటు జగిత్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో నిందితుడు చోరీలకు పాల్పినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వెల్లడించారు. నిందితుడి నుంచి 24.50 గ్రాముల బంగారం, ఓ కారును స్వాధీనం చేసుకున్నామన్నారు.

## వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

**ప్రజలకు కలెక్టర్ సత్యప్రసాద్ సూచన**



జగిత్యాల టౌన్, అక్టోబర్ 29 (ఈవార్తలు): తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో 2 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ బీ సత్యప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి వనరులలో నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్ళవద్దని సూచించారు. కల్వర్టులు దాటువద్దని, నీటి వనరుల సమీపంలో ప్రయాణాలు చేయవద్దని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుండి బయటకు రావద్దని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# నితీశే ముఖ్యమంత్రి: అమిత్ షా

**బీహార్ ఎన్నికల ప్రచారంలో వెల్లడి**

పాట్నా: బీహార్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో ప్రస్తుతం ఏ సీటు ఖాళీగా లేదని ఆయన స్పష్టం చేశారు. నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ఉంటారని తేల్చి చెప్పారు. బీహార్‌లోని దర్భంగాలో బుధవారం జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలు వారసత్వ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. లాలూ ప్రసాద్ యాదవ్ తన తనయుడిని ముఖ్యమంత్రిగా చేయాలని చూస్తే, సోనియా గాంధీ తన కొడుకును ప్రధానమంత్రిని చేయాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వి యాదవ్‌ను ఆర్జేడీ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ ప్రకటించింది. ఎన్డీయే ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించలేదు. దీంతో విపక్షాలు ఈ అంశాన్ని లేవనెత్తాయి. ఈ నేపథ్యంలో నితీశ్ కుమార్ నాయకత్వంలోనే బీహార్ ఎన్నికలకు వెళతామని ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. తాజాగా, నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని అమిత్ షా తేల్చి చెప్పారు.



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ నిర్ణయంపై నెలకొన్న ఆశలు ఇందుకు దోహదపడ్డాయి. దీనికి తోడు, భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలో ఖరారు కావచ్చన్న వార్తలు కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 368.97 పాయింట్లు లాభపడి 84,977.13 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 117.7 పాయింట్లు పెరిగి 26,053.9 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ప్యాక్‌లో ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్, టాటా స్టీల్ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి.

# 26,000 దాటిన నిఫ్టీ




ముంబై : భారత్ ఎలక్ట్రానిక్స్, ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్ నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ సానుకూల వాతావరణం కనిపించింది. ఎన్ఎస్ఈ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.64 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.43 శాతం చొప్పున లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ 2.12 శాతంతో అత్యధికంగా పెరిగింది. ఎనర్జీ, మెటల్, మీడియా, బ్యాంక్, ఐటీ, ఫార్మా వంటి ఇతర రంగాలు కూడా లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ ఆటో రంగం మాత్రం నష్టాలను చవిచూసింది. ప్రస్తుతం మార్కెట్ వర్గాలు అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమావేశం ఫలితాలు, భారత్-యూఎస్ వాణిజ్య ఒప్పందంపై రాబోయే పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి. ఈ అంశాలు రానున్న సెషన్లలో మార్కెట్ గమనాన్ని నిర్దేశించవచ్చని భావిస్తున్నారు. ఫెడ్ 25 బేసిస్ పాయింట్ల వడ్డీ రేటు కోత విధిస్తుందని మార్కెట్ అంచనా వేస్తున్నప్పటికీ, భవిష్యత్తు రేట్ల కోతపై ఫెడ్ చేసే వ్యాఖ్యలు కీలకం కానున్నాయి.

# పంచభూతాలే చంపేస్తున్నాయి!

**వాతావరణ మార్పులతో పెను ముప్పు.. ఏటా లక్షల మంది బలి.. లాన్సెట్ నివేదికలో సంచలన విషయాలు!**

వాతావరణ మార్పుల ప్రభావంపై ప్రఖ్యాత 'లాన్సెట్ కౌంట్‌డౌన్' విడుదల చేసిన నివేదిక యావత్ ప్రపంచాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వాతావరణ మార్పుల విషయంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్ల ఏటా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని ఈ నివేదిక స్పష్టం చేసింది.

ఈరోజు విడుదలైన ఈ నివేదిక ప్రకారం 1990లతో పోలిస్తే అధిక వేడి సంబంధిత మరణాలు 63 శాతం పెరిగాయి. 2012-21 మధ్య కాలంలో ఏటా సగటున 5,46,000 మంది వడదెబ్బ వంటి కారణాలతో మరణించినట్లు తేలింది. ప్రపంచవ్యాప్తంగా 128 మంది నిపుణులు కలిసి ఈ నివేదికను రూపొందించారు. వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్న వరదలు, కరవు, కార్చిచ్చులు, అంటువ్యాధుల వ్యాప్తి వంటి తీవ్ర పరిణామాలను ఇది కళ్లకు కట్టింది.



న్యూఢిల్లీ: మానవ తప్పిదాల వల్ల పెరుగుతున్న గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలే ఈ దుస్థితికి కారణమని నివేదిక తేల్చిచెప్పింది. బ్రెజిల్‌లో నవంబర్‌లో జరగనున్న కాప్ 30 సదస్సుకు ముందు ఈ నివేదిక రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నివేదికపై ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పందించింది. "వాతావరణ సంక్షోభం అంటే ఆరోగ్య సంక్షోభమే. ఉష్ణోగ్రతల్లో పెరిగే ప్రతీ డిగ్రీ ప్రజల ప్రాణాలను, జీవనోపాధిని బలి తీసుకుంటోంది. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే, వాతావరణ మార్పులను ఎదుర్కొనే చర్యలే మన ఆరోగ్యానికి గొప్ప అవకాశం. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన ఆహారం, పటిష్ఠమైన ఆరోగ్య వ్యవస్థలతో మనం లక్షలాది ప్రాణాలను కాపాడుకోవచ్చు" అని డబ్ల్యూహెచ్‌ఓ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జెరెమీ ఫర్రార్ తెలిపారు. ఓవైపు వాతావరణ మార్పులతో ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే, మరోవైపు ప్రభుత్వాలు శిలాజ ఇంధనాలకు భారీగా సబ్సిడీలు ఇస్తున్నాయని నివేదిక తీవ్రంగా విమర్శించింది. 2023లో ప్రభుత్వాలు 956 బిలియన్ డాలర్లను శిలాజ ఇంధన సబ్సిడీలకే ఖర్చు చేశాయి. 15 దేశాలైతే తమ మొత్తం ఆరోగ్య బడ్జెట్ కంటే ఎక్కువగా ఈ సబ్సిడీలకే కేటాయించడం ఆందోళన కలిగించే విషయం. "శిలాజ ఇంధనాల వాడకాన్ని వేగంగా తగ్గించి, పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మళ్లడమే తక్షణ కర్తవ్యం. దీనివల్ల కాలుష్యం, గ్రీన్‌హౌస్ వాయువులు తగ్గి ఏటా కోటి మంది ప్రాణాలను కాపాడవచ్చు" అని లాన్సెట్ కౌంట్‌డౌన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మెరీనా రోమనెల్లో సూచించారు.

### నివేదికలోని కీలక అంశాలు

**2024లో సగటు ఉష్ణోగ్రతలు పారిశ్రామిక యుగం నాటి కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదయ్యాయి.**

**2024లో ఒక సగటు వ్యక్తి 16 రోజుల పాటు ప్రమాదకరమైన వేడిని ఎదుర్కొన్నాడు. శిశువులు, వృద్ధులు 20 రోజులకు పైగా వడగాలులకు గురయ్యారు.**

**అధిక వేడి కారణంగా 2024లో ఏకంగా 640 బిలియన్ల పని గంటలు వృథా అయ్యాయని, దీనివల్ల 1.09 ట్రిలియన్ డాలర్ల ఉత్పాదకత నష్టం వాటిల్లిందని నివేదిక పేర్కొంది.**

**2024లో ప్రపంచంలోని 61 శాతం భూభాగం తీవ్ర కరువు బారిన పడింది. ఇది 1950ల సగటు కంటే 299 శాతం అధికం.**

**కార్చిచ్చుల వల్ల వెలువడిన కాలుష్యంతో 2024లో రికార్డు స్థాయిలో 1,54,000 మంది మరణించారు.**

**డెంగ్యూ వంటి అంటువ్యాధుల వ్యాప్తి గణనీయంగా పెరిగింది.**

## నా రాజకీయ వారసుడు

# జేడీ వాన్స్

**ప్రకటించిన ట్రంప్.. మూడో సారి పోటీ లేదని వెల్లడి**

**అమెరికా చట్టాలు అందుకు అనుమతించవని స్పష్టీకరణ**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాను మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేయడంపై నెలకొన్న ఊహాగానాలకు తెరదించారు. అమెరికా చట్టం ప్రకారం ఏ వ్యక్తి అయినా రెండుసార్లు మాత్రమే అధ్యక్షుడిగా పోటీ చేసేందుకు వీలుందని, తాను మూడోసారి పోటీ చేయలేనని ఆయన బుధవారం పేర్కొన్నారు. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు



చేశారు. "ఇది చాలా ఆసక్తికరమైన విషయం. చాలా ఏళ్లలో ఏ అధ్యక్షుడికీ లేనన్ని మంచి నంబర్లు నాకు ఉన్నాయి. చట్టాన్ని చదివితే చాలా స్పష్టంగా ఉంది.. నేను పోటీ చేయడానికి వీల్లేదు. ఇది చాలా బాధాకరం. కానీ మన దగ్గర చాలా గొప్ప వ్యక్తులు ఉన్నారు" అని ట్రంప్ వివరించారు. తన పాలనకు ప్రజల్లో మంచి ఆదరణ ఉన్నప్పటికీ, చట్టపరమైన నిబంధనల వల్ల పోటీ చేయలేకపోతున్నానని ఆయన పరోక్షంగా పేర్కొన్నారు. గతంలో ట్రంప్ మూడోసారి పోటీ చేసేందుకు 'కొన్ని మార్గాలున్నాయి' అంటూ పదేపదే వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. చట్టాన్ని రకరకాలుగా అన్వయించుకోవచ్చని, ఆయన మళ్లీ పోటీ చేసే అవకాశం ఉందని ఆయన మద్దతుదారులు కూడా ప్రచారం చేశారు. అయితే, తాజా వ్యాఖ్యలతో ఆ ప్రచారానికి ట్రంప్ స్వయంగా ఫుల్ స్టాప్ పెట్టారు. ఇక తన రాజకీయ వారసుడి గురించి కూడా ట్రంప్ గతంలోనే సంకేతాలిచ్చారు. ఈ ఏడాది ఆగస్టులో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన వారసుడు అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. "నిజాయతీగా చెప్పాలంటే, ఆయనే వైస్ ప్రెసిడెంట్ కాబట్టి.. జేడీ వాన్స్‌కే అవకాశాలు ఎక్కువ. బహుశా మార్కో రూబియో కూడా జేడీతో కలిసే అవకాశం ఉంది. అయితే, దీని గురించి మాట్లాడటానికి ఇది చాలా తొందరపాటు అవుతుంది. కానీ వాన్స్ అద్భుతంగా పనిచేస్తున్నారు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అదే సమయంలో, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా స్పందిస్తూ, జేడీ వాన్స్ పోటీ చేయాలని నిర్ణయించుకుంటే 'గొప్ప నామినీ' అవుతారని పేర్కొనడం గమనార్హం.

## వణుకుతున్న కరీబియన్ దీవులు

న్యూయార్క్: కరీబియన్ దీవులను 'మెలిసా' హరికేన్ అతలాకుతలం చేస్తోంది. కేటగిరీ 5 హరికేన్ గా మారిన మెలిసా పలు దేశాలపై పెను విధ్వంసం సృష్టిస్తోంది. గంటకు 295 కిలోమీటర్ల భయానక వేగంతో వీస్తున్న ప్రచండ గాలులకు కరీబియన్ దేశాలు వణికిపోతున్నాయి. ఇప్పటికే జమైకాను దాటిన ఈ హరికేన్, క్యూబాలోని రెండో అతిపెద్ద నగరమైన శాంటియాగో డి క్యూబా వైపు దూసుకెళుతోంది. హరికేన్ తీవ్రతకు అనేక ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకూలాయి. వేలాది ఇళ్ల పైకప్పులు గాలిలో ఎగిరిపోయాయి. ఈ విలయానికి ఇప్పటివరకు ఏడుగురు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. మృతుల్లో జమైకా, హైతీ దేశాలకు చెందిన వారు చెరో ముగ్గురు ఉండగా, డొమినికన్ రిపబ్లిక్‌లో ఒకరు మరణించారు. జమైకాలోని బ్లాక్ నది పరివాహక ప్రాంతంలో మూడు కుటుంబాలు తమ ఇళ్లలోనే చిక్కుకుపోయినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. వరద ప్రవాహం కారణంగా సహాయక సిబ్బంది వారిని చేరుకోలేకపోతున్నారని తెలిపాయి. ప్రమాద తీవ్రతను గుర్తించిన అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. హరికేన్ ప్రభావిత ప్రాంతాల నుంచి దాదాపు 15 వేల మందిని ఖాళీ చేయించి తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించారు. మెలిసా హరికేన్‌ను అత్యంత ప్రమాదకరమైన కేటగిరీ 5గా ప్రకటించడంతో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

## పాకిస్థాన్ జిందాబాద్ వై-ఫై

**బెంగళూరులో యూజర్ ఐడీ కలకలం**

బెంగళూరు: కర్ణాటకలో ఒక నెట్‌వర్క్ వై-ఫై పేరు కలకలం రేపింది. రాష్ట్ర రాజధాని బెంగళూరు శివారు గ్రామం కల్లుబాలులో ఒక వై-ఫై పేరు 'పాకిస్థాన్ జిందాబాద్' అని యూజర్ ఐడీతో కనిపించడం ఆందోళనకు దారితీసింది. 'పాకిస్థాన్ జిందాబాద్' అనే యూజర్ ఐడీని చూసి గ్రామస్థులు నివ్వెరపోయారు. సంఘ విద్రోహ శక్తులు ఏమైనా ఉన్నారేమోనని ఆందోళన చెందారు. ఈ విషయం తెలియడంతో స్థానిక బజరంగ్ దళ్ కార్యకర్తలు, గ్రామస్థులు ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న జిగానీ స్టేషన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. 'పాకిస్థాన్ జిందాబాద్' అనే యూజర్ ఐడీకి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని బజరంగ్ దళ్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఆ వై-ఫై నెట్‌వర్క్ మూలం ఏమిటి? ఆ పేరును ఎవరు సృష్టించారనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ఢిల్లీలో మేఘ మథనం విఫలం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని పట్టిపీడిస్తున్న వాయు కాలుష్యానికి పరిష్కారంగా తలపెట్టిన కృత్రిమ వర్షం ప్రయోగం తొలి ప్రయత్నంలోనే విఫలమైంది. కాలుష్య తీవ్రతను తగ్గించేందుకు నిర్వహించిన క్లౌడ్ సీడింగ్ ప్రయోగం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. విమానాల ద్వారా సిల్వర్ అయోడైడ్‌ను మేఘాలపై చల్లినప్పటికీ ఒక్క వాన చుక్క కూడా నేల రాలలేదు. తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న ఢిల్లీ వాసులకు ఉపశమనం కలిగించేందుకు అక్కడి ప్రభుత్వం కృత్రిమ వర్షం కురిపించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మంగళవారం క్లౌడ్ సీడింగ్ చేపట్టారు. అయితే ఈ ప్రయోగం విజయవంతం కాలేదు. దీనిపై ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ మణీంద్ర అగర్వాల్ స్పందించారు. మేఘాల్లో తేమ శాతం అధికంగా ఉండటం వల్లే ప్రయోగం సత్ఫలితాన్ని ఇవ్వలేదని ఆయన వివరించారు. మంగళవారం మొత్తం 14 మంటలను (ఫ్లేర్స్) పేల్చినట్లు ఆయన తెలిపారు. ఈరోజు మరోసారి క్లౌడ్ సీడింగ్ ప్రయోగం నిర్వహిస్తామని అగర్వాల్ వెల్లడించారు. ఈసారైనా ప్రయోగం కచ్చితంగా విజయవంతమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది కాలుష్యానికి శాశ్వత పరిష్కారం కానప్పటికీ, తక్షణ ఉపశమనాన్ని ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పుడు కాకపోయినా తర్వాత వర్షం కురిసినా ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. కాగా, ఢిల్లీలో కృత్రిమ వర్షం ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.3.21 కోట్లు కేటాయించింది. మొత్తం ఐదు క్లౌడ్ సీడింగ్ ట్రయల్స్ నిర్వహించాలన్న ప్రతిపాదనకు ఢిల్లీ కేబినెట్ మే 7న ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టును పూణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ, భారత వాతావరణ శాఖ నిపుణుల సహకారంతో నిర్వహిస్తున్నారు.

## కాంగ్రెస్ సభలో బంగ్లాదేశ్ జాతీయ గీతం

**అసోంలో రాజకీయ దుమారం**

గౌహతి: అసోంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆ పార్టీ నేత బంగ్లాదేశ్ జాతీయ గీతాన్ని ఆలపించడం తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. కరీంగంజ్ జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. కరీంగంజ్‌లో జరిగిన కాంగ్రెస్ సేవాదళ్ సమావేశంలో పార్టీ నేత బిదు భూషణ్ దాస్ బంగ్లాదేశ్ జాతీయ గీతమైన 'అమర్ సోనార్ బంగ్లా'ను పాడారు. ఈ దృశ్యాలు వీడియో రూపంలో సోషల్ మీడియాలో విస్తృతంగా వ్యాపించాయి. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. "ఇది చొరబాటుదారుల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న ప్రేమను తెలియజేస్తోంది" అని ఘాటుగా విమర్శించింది. ఈ ఘటనపై అసోం మంత్రి కృష్ణేందు పాల్ స్పందిస్తూ, ఇది చాలా వింతైన సంఘటన అని, దీనిపై పోలీసు విచారణ జరిపించాల్సిందిగా కోరతానని తెలిపారు. బంగ్లాదేశ్ సరిహద్దుకు సమీపంలో ఉన్న కరీంగంజ్ వంటి జిల్లాలో ఈ ఘటన జరగడం వివాదాన్ని మరింత పెంచింది. ఈ ప్రాంతంలో చొరబాట్లు అనేవి అత్యంత సున్నితమైన రాజకీయ అంశం కావడంతో, ఈ వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, బీజేపీ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది. తమ నేత పాడింది రవీంద్ర సంగీతం మాత్రమేనని, దానిని బంగ్లాదేశ్ జాతీయ గీతంతో ముడిపెట్టి బీజేపీ అనవసరంగా రాజకీయం చేస్తోందని ఆ పార్టీ నేతలు ఎదురుదాడి చేస్తున్నారు. రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ ఈ అంశాన్ని పెద్దది చేస్తోందని వారు ఆరోపిస్తున్నారు.

## బ్రేకప్ అయ్యింది.. లీవ్ కావాలి

**సీఈవోకు ఉద్యోగి మెయిల్.. సెలవు మంజూరు**

న్యూఢిల్లీ: అనారోగ్యం వల్లో లేక వ్యక్తిగత పనుల కోసమో సెలవు పెట్టడం సర్వ సాధారణం. క్రికెట్ మ్యాచ్ చూడడం కోసం లేని అనారోగ్యాన్ని కొని తెచ్చుకుని సెలవు చీటీ పంపే ఉద్యోగులూ కోకొల్లలు. అయితే, ఓ ఉద్యోగి మాత్రం ప్రియురాలితో తనకు బ్రేకప్ అయిందని, ఆ బాధ నుంచి కోలుకోవడానికి కొన్ని రోజులు సెలవు కావాలని కంపెనీ సీఈవోకు మెయిల్ చేశాడు. ఈ ఈమెయిల్ ను అందుకున్న సీఈవో ఆశ్చర్యపోయారు. స్క్రీన్ షాట్ తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. 'తన వృత్తి జీవితంలో అందుకున్న అత్యంత నిజాయతీ గల సెలవు దరఖాస్తు ఇదే' అంటూ క్యాప్షన్ జోడించారు. ఈ పోస్టు కాస్తా వైరల్ గా మారింది. వివరాల్లోకి వెళితే.. నాట్ డేటింగ్ అనే సంస్థ సీఈవో జస్వీర్ సింగ్ ఇటీవల ఓ ఆశ్చర్యకరమైన సెలవు దరఖాస్తును అందుకున్నారు. తన సంస్థలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి తనకు బ్రేకప్ అయ్యిందని, ఆ బాధలో పనిపై శ్రద్ధ పెట్టలేకపోతున్నానని మెయిల్ చేశాడు. తనకు కొన్ని రోజులు సెలవు కావాలని కోరాడు. దీనిపై జస్వీర్ సింగ్ స్పందిస్తూ.. జెన్ జెడ్ తరం ఉద్యోగులు తమ మనసులో ఏమీ దాచుకోరని మెచ్చుకున్నారు.


# మోదీ మంచోడే.. కానీ!

**భారత ప్రధాని కఠినాత్ముడే**

**వాణిజ్య ఒప్పందంపై శుభవార్త చెప్పిన ట్రంప్**

**త్వరలోనే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం**

**ఒప్పందంపై డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన**



వాషింగ్టన్: భారత్, అమెరికా మధ్య చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందంపై త్వరలోనే సంతకాలు జరగనున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం స్పష్టం చేశారు. తన ఆసియా పర్యటనలో చివరిగా దక్షిణ కొరియాలో ఉన్న ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ తాజా ప్రకటనతో ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య ఒప్పందం ఖరారవడం ఇక లాంఛనమేనని తెలుస్తోంది. కొన్ని నెలలుగా ఈ ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం, ఇరు దేశాల మధ్య టారిఫ్‌లకు సంబంధించిన వివాదాల కారణంగా ఈ చర్చలు ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ట్రంప్ మాట్లాడుతూ.. "నేను భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకుంటున్నాను. ప్రధాని నరేంద్ర మోదీ అంటే నాకు ఎంతో గౌరవం, ప్రేమ ఉన్నాయి. మా మధ్య గొప్ప సంబంధం ఉంది" అని పేర్కొన్నారు. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించుకోవడానికి అంగీకరించడంతో, భారత వస్తువులపై విధిస్తున్న 50 శాతం టారిఫ్‌ను 16 శాతానికి తగ్గించడానికి అమెరికా ఒప్పుకున్నట్లు గతవారం వార్తలు వచ్చాయి. ట్రంప్, మోదీ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ తర్వాత ఈ పురోగతి సాధ్యమైనట్లు సమాచారం. ఈ ఒప్పందంలో భాగంగా జన్యుమార్పిడి చేయని అమెరికన్ మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులను పెంచేందుకు భారత్ అంగీకరించే అవకాశం ఉంది. ఇదే సమయంలో ప్రధాని మోదీని ప్రశంసలతో ముంచెత్తిన ట్రంప్, భారత్-పాకిస్థాన్ మధ్య మే 10న జరిగిన కాల్పుల విరమణ ఘనతను మరోసారి తన ఖాతాలో వేసుకున్నారు. అయితే, ట్రంప్ వాదనలను భారత్ ఇప్పటికే పలుమార్లు ఖండించింది. "ఆ రెండు అణు దేశాలు తీవ్రంగా ఘర్షణ పడుతున్నాయి. నేను ప్రధాని మోదీకి ఫోన్ చేసి, 'మీరు పాకిస్థాన్‌తో యుద్ధం ప్రారంభిస్తే, మేం మీతో వాణిజ్య ఒప్పందం చేసుకోలేం' అని చెప్పాను" అని ట్రంప్ వివరించారు. "ప్రధాని మోదీ చూడటానికి చాలా మంచి వ్యక్తి, కానీ ఆయన చాలా కఠినుడు. నేను ఫోన్ చేసిన రెండు రోజులకే వారు యుద్ధం ఆపారు" అని ట్రంప్ పేర్కొన్నారు.




# అమీర్ ఖాన్ వల్లే తల్లిదండ్రులం అయ్యాం



తమిళ నటుడు విష్ణు విశాల్ దంపతులు ఇటీవల తల్లిదండ్రులు అయ్యారు. విష్ణు విశాల్ భార్య జ్వాలా గుత్తా కుమార్తెకు జన్మనివ్వడం, ఆ పాపకు బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్ ఖాన్ మీరా అని పేరు పెట్టడం జరిగింది. విష్ణు విశాల్, జ్వాలా గుత్తాల బేబీకి అమీర్ ఖాన్ ఎందుకు పేరు పెట్టాడు, అసలు వీరి మధ్య ఉన్న అనుబంధం ఏంటి, ఎప్పటి నుంచి వీరి మధ్య రిలేషన్ కొనసాగుతోంది. అమీర్ ఖాన్ ప్రత్యేకంగా విష్ణు విశాల్, జ్వాలా గుత్తాపై అభిమానం చూపించి వారి పాపకు పేరు పెట్టడం వెనుక ఉన్న కారణం ఏంటా అని అంతా ఆసక్తిగా మాట్లాడుకుంటున్నారు. ఈ సమయంలో విష్ణు విశాల్ ఈ విషయమై క్లారిటీ ఇచ్చాడు. అమీర్ ఖాన్‌తోనూ, ఆయన ఫ్యామిలీతోనూ తనకు, జ్వాలా గుత్తాకు ఉన్న అనుబంధం, ఏర్పడిన పరిచయం గురించి చెప్పుకొచ్చాడు. తాము తల్లిదండ్రులం కావడానికి అమీర్ ఖాన్ కారణం అని విష్ణు విశాల్ చెప్పుకొచ్చాడు. విష్ణు విశాల్ ఇటీవల ఒక చిట్ చాట్‌లో మాట్లాడుతూ... 2023లో అమీర్ ఖాన్ తల్లి జీనత్ హుస్సేన్ కు చెన్నైలో అనారోగ్య కారణాల వల్ల చికిత్స చేయించాల్సి వచ్చినప్పుడు, అలాగే ఆయన ఒక షూటింగ్ నిమిత్తం చెన్నైలో ఉండాల్సి వచ్చినప్పుడు తాను స్వయంగా చెన్నైలో బస ఏర్పాటు చేసినట్లు చెప్పుకొచ్చాడు. ఆ సమయంలోనే అమీర్ ఖాన్‌తో ఏర్పడిన సన్నిహిత్యం కారణంగా రెగ్యులర్‌గా ఆయనతో మాట్లాడుతూ ఉండేవాళ్లం. ఆ సమయంలోనే మేము తల్లిదండ్రులం కావడానికి ఇబ్బంది పడుతున్నట్లు ఆయన తెలుసుకున్నారు. ఒకానొక సమయంలో జ్వాలా తల్లి కావాలనే కోరికతో ఒక బిడ్డను దత్తత తీసుకోవాలని నిర్ణయించుకుంది. అలాంటి సమయంలో అమీర్ ఖాన్ సలహా మేరకు మేము ఐవీఎఫ్ కి వెళ్లామని విష్ణు విశాల్, ఆయన వల్లే ఇప్పుడు మా జీవితంలో సంతోషం ఉందని పేర్కొన్నాడు.


# కల్కి క్రెడిట్స్ నుంచి దీపిక పేరు తొలగింపు



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'కల్కి 2898 ఏడీ ' మరో కొత్త వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమాలో కీలక పాత్ర పోషించిన అగ్ర నటి దీపికా పదుకొణె పేరును ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో స్ట్రీమింగ్ అవుతున్న చిత్రం చివరి క్రెడిట్స్ నుంచి మేకర్స్ తొలగించారంటూ సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి దీపికా పదుకొణె తప్పుకున్నట్లు నిర్మాణ సంస్థ వైజయంతి మూవీస్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ వివాదం సద్దుమణగక ముందే ఇప్పుడు ఓటీటీలో ఉన్న కల్కి ఫస్ట్ పార్ట్‌లో క్రెడిట్స్ నుంచి దీపికా పదుకొణె పేరును తొలగించినట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరలవుతున్నాయి.

# చనిపోదాం అనుకున్నా..

జీవితం ఎవరికీ పూలబాట కాదు.. ఇండస్ట్రీలోని ఎంతోమంది వ్యక్తుల జీవితాలకు ఈ సామెత అద్దం పడుతుంది. తన పాటలతో, సంగీతంతో అందరినీ అలరించే సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో.. తాజాగా జరిగిన 'మాస్ జాతర' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడిన మాటలు అందరినీ కదిలించేస్తున్నాయి. ఒకప్పుడు అవకాశాలు లేక కుటుంబంతో సహా చనిపోదాం అనుకున్నట్లు ఆయన తెలిపారు. ఆ సమయంలో దేవుడిలా రవితేజ కాపాడాడని.. ఆయన లేకపోతే తాను లేనని తెలిపారు. ప్రస్తుతం భీమ్స్ మాటలు వైరల్ అవుతున్నాయి. "నేను ఏ విషయాన్నైనా పాట రూపంలో తెలుపుతాను. ఒకసారి నా పరిస్థితిని తెలుపుతూ ఒక సెల్ఫీ వీడియో తీసుకున్నా.. అందులో నా భార్య పిల్లలు కూడా కనిపించేలా తీశాను. నేను ఎందుకు వీడియో తీస్తున్నానో అప్పుడు వాళ్లకు తెలియదు. ఇంటికి అద్దె ఎలా కట్టాలి, పిల్లల్ని ఎలా చదివించాలి, ఎలా బతకాలి అని ఆలోచిస్తూ ఆ వీడియో తీశాను. అప్పుడు చిట్టచివరి క్షణంలో నాకు ఒక ఫోన్ వచ్చింది. మీరు పీపుల్స్ మీడియా ఆఫీసుకు రావాలి అని.. ఆ కాల్ నా జీవితాన్ని మార్చేసింది " అని పేర్కొన్నాడు.




# 'మెగా 158' రూమర్స్‌పై మాళవిక క్లారిటీ

మెగాస్టార్ చిరంజీవి బాబీ కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. వాల్తేర్ వీరయ్య లాంటి సూపర్ హిట్ తర్వాత ఈ జోడి మళ్లీ కలిసి పనిచేయబోతుంది. మెగా 158 అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే సెట్స్ మీదకి వెళ్లనుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా మాళవిక మోహనన్ నటించబోతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై నటి స్పందిస్తూ.. అవన్నీ రూమర్స్ అంటూ తెలిపింది. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. నేను 'మెగా 158' చిత్రంలో నటిస్తున్నానని ఆన్‌లైన్‌లో అనేక వార్తలు వస్తున్నాయి. అయితే నా కెరీర్‌లో ఏదో ఒక రోజు ఐకానిక్ చిరంజీవి సార్‌తో స్క్రీన్ పంచుకోవాలని నేను ఎంతగానో కోరుకుంటున్నాను. కానీ ప్రస్తుతం నేను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదు. ఆ వార్తలు అవాస్తవం అంటూ మళావిక రాసుకోచ్చింది. దీంతో చిరంజీవి సరసన మాళవిక నటించబోతున్నారనే ఊహాగానాలకు తెరపడింది. త్వరలోనే ఈ చిత్రంలో నటించబోయే కథానాయిక గురించి చిత్ర బృందం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.



# ఫుల్ స్వింగ్‌లో 'పెద్ది' షూటింగ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్యాన్ ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది'పై ప్రేక్షకుల్లో అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. 'ఉప్పెన'తో సెన్సేషన్ సృష్టించిన బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే భారీ క్రేజ్ సంపాదించుకుంది. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' టీమ్ ప్రస్తుతం శ్రీలంకలో కీలకమైన షెడ్యూల్‌లో బిజీగా ఉంది. అక్కడ రామ్ చరణ్ %-% జాన్వీ కపూర్ జంటపై ఓ అందమైన పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ పాటకు ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో, ఇది విజువల్‌గా, మ్యూజికల్‌గా గ్రాండ్ ట్రీట్‌గా మారబోతోందని ఫిల్మ్‌నగర్ టాక్. రామ్ చరణ్ కూడా ఇటీవల శ్రీలంక బయలుదేరుతుండగా ఎయిర్‌పోర్ట్‌లో కనిపించారు. ఇంతలో, శ్రీలంక లొకేషన్స్ నుంచి కొన్ని ఆసక్తికరమైన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



# భాగ్యశ్రీకి భాగ్యం కలిగేనా..!

బాలీవుడ్ నుంచి మాస్ మహారాజ్ రవితేజ మిస్టర్ బచ్చన్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది భాగ్య శ్రీ బోర్స్. మిస్టర్ బచ్చన్ టైం లో అమ్మడు ఆడియన్స్ ని బాగానే ఎట్రాక్ట్ చేసింది. ఆమె లుక్స్, ప్రమోషన్స్ లో యాక్టివ్ నెస్ అన్నీ నచ్చేశాయి. ఐతే మిస్టర్ బచ్చన్ రిజల్ట్ మాత్రం డిజప్పాయింట్ చేసింది. ఇక ఆ నెక్స్ట్ వచ్చిన విజయ్ దేవరకొండ కింగ్ డమ్ అయినా కెరీర్ కి పుష్ ఇస్తుంది అనుకుంటే అది కూడా మిస్ ఫైర్ అయ్యింది. సినిమాలో ఆమె హీరోయిన్ కాదు ఒక చిన్న రోల్ చేసింది అనిపించేలా షాక్ ఇచ్చింది. ఇక భాగ్య శ్రీ లేటెస్ట్ సినిమా ఆంధ్రా కింగ్ తాలూకా. రామ్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమాను మహేష్ బాబు పి డైరెక్ట్ చేశాడు. సినిమాలో భాగ్య శ్రీ హీరోయిన్ గా నటించింది. రామ్ తో లవ్ స్టోరీ అంటే హీరోయిన్స్ కి మంచి బూస్టింగ్ ఇస్తుంది. రామ్, భాగ్య శ్రీ జోడీ కూడా అదిరిపోయింది. ఆంధ్రా కింగ్ తాలూకా సినిమా టీజర్ తోనే సినిమా రేంజ్ ఏంటన్నది చూపించారు. సినిమాలో భాగ్య శ్రీకి మంచి రోల్ దక్కినట్టు అనిపిస్తుంది. ఈ సినిమాతో భాగ్య శ్రీకి లక్ కలిసి రావాల్సిందే. ఎందుకంటే మొదటి రెండు సినిమాలు కమర్షియల్ గా వర్క్ అవుట్ కాలేదు. కానీ ఈ సినిమా బజ్ చూస్తుంటే భాగ్యానికి ఫస్ట్ సూపర్ హిట్ పడేలా ఉంది. భాగ్య శ్రీ ఆంధ్రా కింగ్ తాలూకా సినిమా సక్సెస్ అయితేనే తెలుగులో ఆమెకు మరిన్ని అవకాశాలు వచ్చే ఛాన్స్ ఉంటుంది.



# తెలుగోళ్ల దత్తపుత్రుడు హీరో సూర్య





గజిని, ఆరు, సూర్య సన్నాఫ్ కృష్ణన్, సింగం, సింగం 2, రక్తచరిత్ర, వాడు వీడు, జై భీమ్, ఆకాశం నీ హద్దుగా.. ఇలాంటి ఎన్నో క్రేజీ చిత్రాలతో సూర్య తెలుగు నాట కూడా గొప్ప ఆదరణ పొందాడు. కెరీర్ లో ఎన్నో ప్రయోగాత్మక చిత్రాలతో సూర్య తన ఉనికిని చాటుకున్నాడు. ఇటీవల కొన్ని పరాజయాలు అతడికి ఇబ్బందిగా మారినా కానీ, ఇప్పుడు అన్నిటి నుంచి బయటపడుతున్నాడు. అతడు తెలుగు దర్శకులతోను పని చేస్తూ, తెలుగు వారికి అత్యంత ప్రాధాన్యతనివ్వడం చర్చగా మారింది. దశాబ్దాలుగా తన అనువాద చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న సూర్య, ఇప్పుడు నేరుగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెలుగు-తమిళ ద్విభాషా చిత్రంలో నటిస్తున్నాడు. ఇక జయాపజయాలతో సంబంధం లేకుండా అతడు టాలీవుడ్ లో అభిమానం చూరగొంటున్నాడనడానికి నిన్నటి మాస్ జాతర ఈవెంట్ ఒక పెద్ద లైవ్ ఎగ్జాంపుల్. ఈ వేదికపై సూర్య ప్రసంగిస్తుంటే ఫ్యాన్స్ విజిల్స్ తో జోష్ చూపించారు. రవితేజపై ప్రశంసలు కురిపిస్తున్న సూర్యను మాస్ రాజా ఫ్యాన్స్ వోన్ చేసుకున్నారు. అదే వేదికపై నటకిరీటి, సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ నేరుగా సూర్యకు తెలుగు ప్రేక్షకులలో ఉన్న అభిమానాన్ని హైలైట్ చేస్తూ మాట్లాడారు.




# నన్ను విలన్‌ను చేశారు

భారత స్టార్ బౌలర్ మహమ్మద్ షమీ టీమిండియాకు దూరంగా ఉన్నప్పటికీ.. రంజీ ట్రోఫీలో సంచలనం సృష్టిస్తున్నాడు. రంజీ ట్రోఫీలో అద్భుతంగా రాణించి తాను రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు నిరూపించుకుంటున్నాడు. రంజీ ట్రోఫీలో రెండు మ్యాచ్‌లలో 15 వికెట్లు తీసి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవడమే కాకుండా సెలెక్టర్లకు గట్టి సమాధానమిచ్చాడు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో గుజరాత్‌తో జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో మొత్తం 8 వికెట్లు పడగొట్టి బెంగాల్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ అనంతరం టీమిండియాలో ఎంపిక కాకపోవడంపై జరుగుతున్న వివాదంపై షమీ కీలక ప్రకటన చేశాడు. మంగళవారం గుజరాత్‌పై రెండో ఇన్నింగ్స్‌లో షమీ 38 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి, తన జట్టుకు 141 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందించాడు. మ్యాచ్ తర్వాత మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక కాకపోవడంపై చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ చేసిన వ్యాఖ్యల గురించి అడగ్గా, షమీ ఇలా అన్నాడు. "నాకు తెలుసు, ఈ ప్రశ్న వస్తుందని. నేను ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో ఉంటాను. మీరు నన్ను అప్పటికే విలన్‌గా మార్చేశారు. దీని గురించి నేను ఇంకేం చెప్పగలను? ఈ రోజుల్లో సోషల్ మీడియాలో ప్రతి చిన్న విషయాన్ని వక్రీకరించి చూపిస్తున్నారు. నా పని కేవలం బాగా ప్రదర్శన ఇవ్వడం, ఫిట్‌గా ఉండి భారత జట్టు కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడం. నాకు అవకాశం దొరికినప్పుడల్లా నా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తాను. మిగతాదంతా సెలెక్టర్లపై ఆధారపడి ఉంటుంది." అని పేర్కొన్నాడు.



భారత క్రికెట్ చరిత్రలో అత్యంత ప్రతిభావంతుల్లో ఒకరిగా, అత్యంత వివాదాస్పదుల్లో ఒకరిగా నిలిచిన మహ్మద్ అజారుద్దీన్ మరో కొత్త ఇన్నింగ్స్‌కు సిద్ధమయ్యారు. హైదరాబాదీ అయిన అజార్, ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర కేబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. క్రికెట్ మైదానం నుంచి రాజకీయ అధికార కేంద్రం వరకు ఆయన ప్రయాణం ఎన్నో ఎత్తుపల్లాలు, ఊహించని మలుపులతో నిండి ఉంది. 1984లో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌తో అజారుద్దీన్ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టారు. అరంగేట్రంలోనే హ్యాట్రిక్ సెంచరీలు (మొదటి మూడు టెస్టుల్లో సెంచరీలు) సాధించిన ఏకైక ఆటగాడిగా ఆయన చరిత్ర సృష్టించారు. తన మణికట్టు మాయాజాలంతో ప్రపంచ క్రికెట్ అభిమానులను మంత్రముగ్ధుల్ని చేశారు. 90వ దశకంలో భారత జట్టుకు సారథ్యం వహించి, అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా నిలిచారు.

# వివాదాల అజారుద్దీన్!



## మ్యాచ్ ఫిక్సింగ్

99 టెస్ట్ మ్యాచ్‌లతో అపారమైన కీర్తిని సంపాదించుకున్న అజార్ కెరీర్‌కు 2000వ సంవత్సరంలో అకస్మాత్తుగా తెరపడింది. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలతో బీసీసీఐ ఆయనపై జీవితకాల నిషేధం విధించింది. ఈ వివాదం భారత క్రికెట్ చరిత్రలోనే చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత 2012లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈ నిషేధాన్ని రద్దు చేసినప్పటికీ ఆయన కెరీర్ ముగిసింది. క్రికెట్‌కు దూరమైన అజారుద్దీన్ 2009లో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. 2014లో రాజస్థాన్‌లోని సవాయి మాధోపూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2018 నుంచి తెలంగాణ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉంటూ తన సొంత గడ్డపై చురుకైన పాత్ర పోషించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి స్వల్ప తేడాతో ఓడిపోయారు.

## మంత్రిగా కొత్త ఇన్నింగ్స్

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సీటు కోసం చివరి వరకు ప్రయత్నించిన అజారుద్దీన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనూహ్యంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. దీని వెనుక కీలకమైన రాజకీయ వ్యూహం ఉంది. కేబినెట్‌లో మైనారిటీ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించడం కోసమే మంత్రి పదవిని కేటాయించినట్లు తెలుస్తోంది. ఉపఎన్నికలో బీసీ అభ్యర్థికి సీటు ఇచ్చి, అజార్‌ను మంత్రిగా చేయడం ద్వారా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సామాజిక సమతుల్యత సాధించడం కోసమే చేసినట్లు కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంతర్గత హామీల మేరకు, అక్టోబర్ 31న ఆయన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనకు మైనారిటీ సంక్షేమంతో పాటు క్రీడా శాఖ అప్పగించే అవకాశం ఉంది. మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు, వ్యక్తిగత జీవితంలోని ఒడిదుడుకులు (వివాహాలు, విడాకులు) వంటి సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ, తన పోరాట పటిమను కోల్పోకుండా అజారుద్దీన్ క్రికెట్ గ్లోరీ నుంచి పొలిటికల్ పవర్ వరకు చేరుకున్నారు. ఇది ఆటగాడిగా ఆయన జీవితం ముగిసిపోలేదని, రాజకీయ నేతగా ఆయన కొత్త శక్తిని పుంజుకున్నారని తెలియజేస్తుంది.

# రోహిత్ శర్మ వన్డేల్లో నం. 1



ఆస్ట్రేలియాతో ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ వన్డే మ్యాచ్ ఆడిన రోహిత్ శర్మ అదరగొట్టాడు. మూడు వన్డేల సిరీస్‌లో ఒక సెంచరీ, హాఫ్ సెంచరీ చేసిన అతడు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు సొంతం చేసుకున్నాడు. ఆ సిరీస్‌లో రోహిత్ ప్రదర్శనకు ఐసీసీ ర్యాంకుల్లో ఫలితం కనిపించింది. వన్డేల్లో టాప్ ర్యాంకర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు అక్కడ ఉన్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండు స్థానాలు కిందికి దిగజారి మూడో స్థానానికి పడిపోయాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ 781 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. అఫ్గానిస్థాన్ ప్లేయర్ ఇబ్రహీం జద్రాన్ (764) రెండో స్థానంలో ఉండగా.. శుభ్‌మన్ గిల్ (745), బాబర్ అజామ్ (739), విరాట్ కోహ్లీ (725) ఆ తర్వాత స్థానాల్లో కొనసాగుతున్నారు. ఆసీస్‌తో మూడో వన్డేలో హాఫ్ సెంచరీ చేసినప్పటికీ విరాట్ ఒక స్థానం పడిపోయాడు. అంతకుముందు రెండు మ్యాచుల్లోనూ డకౌట్ కావడమే దీనికి కారణమని క్రికెట్ విశ్లేషకుల అంచనా. శ్రేయస్ అయ్యర్ (700) టాప్ -10లో కొనసాగుతున్నాడు. ఇక ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ (589) ఏకంగా 23 స్థానాలను మెరుగుపర్చుకొని 25వ ర్యాంక్‌ను అందుకొన్నాడు. బౌలింగ్ విభాగంలో టీమ్ఇండియా తరఫున కేవలం ఒక్కరు మాత్రమే ఉండటం గమనార్హం. అదీనూ కుల్‌దీప్ యాదవ్ (634) ఒక ప్లేస్‌ను కోల్పోయి ఏడో ర్యాంకులో నిలిచాడు. ఆసీస్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్ (628) రెండు స్థానాలు పైకి ఎగబాకి 8వ ర్యాంకులో ఉన్నాడు. అఫ్గాన్ ఆటగాడు రషీద్ ఖాన్ (710) బౌలింగ్ విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో రవీంద్ర జడేజా (215) మాత్రమే ఉన్నాడు. అతడు ఆసీస్‌తో వన్డే సిరీస్‌లో ఆడని సంగతి తెలిసిందే. అక్షర్ పటేల్ (208) రెండు స్థానాలను మెరుగుపర్చుకొని 12వ ర్యాంకులో నిలిచాడు. ఇందులోనూ అఫ్గాన్ ఆటగాడు అజ్మతుల్లా ఒమర్జాయ్‌దే (334) టాప్ ర్యాంకర్.




# టీ20 మ్యాచులకు నితీశ్ దూరం

భారత ఆటగాళ్లకు గాయాల సమస్య మళ్లీ మొదలైంది. ఆస్ట్రేలియాతో చివరి వన్డే సందర్భంగా శ్రేయస్ అయ్యర్ తీవ్రంగా గాయపడ్డాడు. అంతకుముందు రెండో వన్డే సమయంలోనే తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి గాయంతో వైదొలిగాడు. అప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలోనే నితీశ్ ఉన్నాడు. ఇంకా పూర్తిగా కోలుకోలేదని బీసీసీఐ అప్‌డేట్ ఇచ్చింది. ఇప్పుడు ఐదు టీ20ల సిరీస్‌లోని తొలి మూడు టీ20లకు దూరంగా ఉంటాడని బీసీసీఐ వెల్లడించింది. "నితీశ్ కుమార్ తొలి మూడు మ్యాచుల్లో ఆడటంలేదు. ఎడమ తొడ కండరాల నొప్పి నుంచి కోలుకుంటున్నాడు. అడిలైడ్‌లో నితీశ్ గాయంతో ఇబ్బంది పడ్డాడు. మెడ నొప్పితోపాటు ఇతర సమస్యలు ఉన్నాయని వైద్యుల దృష్టికి తీసుకొచ్చాడు. అతడిని నిరంతరం మా మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తోంది" అని బీసీసీఐ పోస్టు పెట్టింది.

# తొలి టీ20 వర్షార్పణం

## గిల్, సూర్య మెరుపులు వృథా



భారత్, ఆస్ట్రేలియా మధ్య జరగాల్సిన ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి పోరు వరుణుడి కారణంగా రద్దైంది. కాన్‌బెర్రాలోని మనుకా ఓవల్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో వర్షం పదేపదే అంతరాయం కలిగించడంతో, చివరకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా ఓపెనర్ శుభ్‌మన్ గిల్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మెరుపు షాట్లతో చెలరేగిపోయారు. కేవలం 9.4 ఓవర్లలోనే భారత్ 1 వికెట్ నష్టానికి 97 పరుగుల భారీ స్కోరు చేసింది. సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్ తొలి వర్ష విరామం తర్వాత గేర్ మార్చి, దూకుడుగా ఆడటం ప్రారంభించారు. వారిద్దరూ కలిసి ఆసీస్ బౌలర్లను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డారు. అయితే భారత ఇన్నింగ్స్ 9.4 ఓవర్ల వద్ద ఉండగా మళ్లీ భారీ వర్షం మొదలైంది. ఎంతకీ వర్షం తగ్గకపోవడం, మైదానం చిత్తడిగా మారడంతో, తదుపరి ఆట నిర్వహించడం సాధ్యం కాదని నిర్వాహకులు నిర్ణయించారు. ఈ మ్యాచ్ రద్దు కావడంతో ఇరు జట్లకు చెరో పాయింట్ లభించింది. యువ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో దూకుడుగా ఆడిన భారత యువ బ్యాటర్ల మెరుపు ఇన్నింగ్స్‌ను పూర్తి మ్యాచ్‌లో చూడలేకపోవడం అభిమానులకు నిరాశ కలిగించింది. కాన్‌బెర్రాలో జరిగిన మొదటి టీ20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ టాస్ గెలిచి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. ఈ నిర్ణయం ద్వారా అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌ల్లో టాస్ గెలిచిన 18 సందర్భాలలో మార్ష్ ఫీల్డింగ్ ఎంచుకోవడం ఒక ప్రత్యేక రికార్డుగా నమోదైంది. కానీ ఈ మ్యాచ్ వర్షార్పణం అయింది.

# 'కంగారూ'ను జయిస్తేనే ఫైనల్‌కు

మహిళల ప్రపంచ కప్ ఆఖరి దశకు చేరుకుంది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన టీమ్ఇండియా.. ఆశించిన మేరకు ప్రదర్శన చేయకపోయినా కాస్త అదృష్టం తోడవడంతో నాలుగో స్థానంలో నిలిచి సెమీస్‌కు అర్హత సాధించింది. వర్షం అంతరాయంతో టోర్నీలో ఇతర జట్లకు సంబంధించిన చాలా మ్యాచ్‌లు రద్దు కాగా.. భారత్ ఏడు పాయింట్లతో నాకౌట్ దశకు క్వాలిఫై అయింది. కానీ, ఇక్కడితో సంబరపడొద్దు. అసలు సిసలు పరీక్ష ముందుంది. ఇప్పటివరకు రెండుసార్లు ఫైనల్ చేరినా కప్పు కలను సాకారం చేసుకోలేకపోయిన టీమ్ఇండియా.. మూడోసారి టైటిల్ పోరుకు దూసుకెళ్లాలంటే ముందుగా 'కంగారూ'ను జయించాలి. అక్టోబర్ 30న జరిగే రెండో సెమీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను హర్మన్‌ప్రీత్ సేన అమీ తుమీ తేల్చుకోనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియాను ఓడించడం భారత్‌కు అంత తేలిక కాదు.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
గురువారం 30-10-2025 | www.evarthalu.com



# పొదుపే.. భవిష్యత్తుకు బంగారం

ఆదాయాలు పెరుగుతున్నట్లుగా కనిపించినా, ఖర్చులు అంతకు రెట్టింపవుతున్నాయి. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ వచ్చి చిన్న షాపులనే కాదు.. చిన్న కుటుంబాలనూ మింగేస్తున్నాయి. డిస్కౌంట్‌ల పేరుతో ఊరిస్తూ...మనసును ప్రలోభపెడుతుంటాయి. అవసరమున్నా లేకున్నా...జేబులో డబ్బులు, మన బడ్జెట్ ఎంత? అన్న లెక్కలన్నీ తారుమారైపోతున్నాయి.

మనిషి బలహీనతను మాల్స్ రూపంలో వున్న తిమింగలం మింగేస్తున్నది. నట్టింట్లో టీవీ, అరచేతిలో స్మార్ట్‌ఫోన్ వుంటే చాలు.. కార్పొరేట్ ప్రపంచంలోని రకరకాల ప్రకటనలు ప్రలోభపెడుతూనే వుంటాయి. డిస్కౌంట్లు, ఇఎంఐలు, క్రెడిట్ కార్డులు మన నియంత్రణను పరీక్షిస్తుంటాయి. బైక్, కారు, ఇల్లు, బంగారం, ఫ్రిజ్, టీవీ... ఇలా ఆర్థిక స్థితిని మించి కొనేయడం, వాటికి ఏళ్ల తరబడి వాయిదాలు కడుతూనే వుంటాం. ఈ పద్ధతే అవసరాలకు, ఆర్థికానికి మధ్య తీవ్రమైన అంతరాన్ని మిగుల్చుతున్నది. ఈ రెండిటి మధ్య తేడాను తెలుసుకోగలిగితే పొదుపు అలవాటు చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ, అదే పెద్ద కష్టం. ప్రతి ఒక్కరి జీవితంలో అవసరాలు, అత్యవసరాలు, ఆనందాలు వుంటాయి. అవసరం వేరు, ఆర్భాటం వేరు. డబ్బే జీవితం కాదు. కానీ, ప్రతి అవసరానికీ, ఆనందాలకీ, సరదాలకీ డబ్బు కావాల్సిందే. అదే సందర్భంలో నిత్యం పెరిగే ధరలు, నిలకడలేని ఉద్యోగాలు, అనుకోని అనారోగ్యాలు-అన్నీ మనిషిని ఇబ్బంది పెట్టేవే. దేనికి ఖర్చు చేయాలి, దేనికి అవసరంలేదు అనే నియంత్రణ మనిషికి అవసరం. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పొదుపు చేయడం ప్రారంభిస్తే...జీవితంలో ఆర్థిక లోటు ఏర్పడదు. అయితే- భారతీయుల్లో తక్కువ పొదుపు...ఎక్కువ రుణాలు పెరిగాయని, 2022-23లో నికర గృహ ఆర్థిక పొదుపు జీడీపీలో 5.1 శాతానికి పడిపోయిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన తాజా నివేదికలో వెల్లడించింది. కరోనా తర్వాత బ్యాంకుల దూకుడు రుణ వ్యూహాల కారణంగా 30 కోట్లకు పైగా భారతీయ కుటుంబాల రుణ స్థాయిలు పెరిగాయి. 2021-22 చివరి నాటికి రూ.1.48 లక్షల కోట్లున్న క్రెడిట్ కార్డుల బకాయిలు 2022-23 నాటికి రూ.1.94 లక్షల కోట్లకు పెరిగాయి. ఆస్తుల స్థాయిలు పడిపోవడంతో... ఆర్థిక భారాలు పెరగడం అనేది పెరుగుతున్న అసమానతలకు సంకేతం. 'నీ మనసుని, శరీరాన్ని




ఆరోగ్యంగా అట్టేపెట్టని ఖర్చు ఒక్క దమ్మిడీ చెయ్యకు' అంటాడు కొడవటిగంటి. ఇది వ్యక్తులకే కాదు....పాలకులకు, ప్రభుత్వాలకూ వర్తిస్తుంది. నయా ఉదారవాద ఆర్థిక విధానాల పుణ్యమాని... ప్రపంచంలో వినిమయదారీ సంస్కృతి విపరీతంగా పెరిగింది. చేతిలో నయాపైసా లేకపోయినా, మధ్యతరగతి జీవితాలను ఆశల పల్లకిలో విహరింపజేస్తూ... క్రెడిట్ కార్డులు, ఇఎంఐ ల రూపంలో వున్నదంతా ఊడ్చేస్తున్నారు. 'అప్పు తెచ్చి వేసిన మిద్దెల్లో/ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న దీనత్వం నీది' అంటాడు చెరబండరాజు. ఇలాంటి ప్రతి సందర్భాన్నుంచీ బయటపడేసేదే పొదుపు.

మన ఆర్థిక అలవాట్లను పునరాలోచించుకోవడానికి, వాస్తవిక లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి, సురక్షితమైన, సుసంపన్నమైన భవిష్యత్ కోసం పొదుపు పాటించడం అవసరం. పొదుపు కేవలం వ్యక్తిగత ప్రయోజనమే కాదు... సామాజిక బాధ్యత అని ఈ రోజు గుర్తు చేస్తుంది. పొదుపు అలవాటు ప్రారంభంలో కొంత కష్టమనిపించినా... తినగ తినగ వేము తీయనుండు అన్నట్టుగా తర్వాత్తర్వాత సులభమవుతుంది. 'ఇదమే వహి పాండిత్యం/ ఇదమే వహి శూరత/ ఇదమే వహి వైదగ్ధ్యం/ ఆదాదల్పతరో వ్యయ:' అన్నారు. ఆదాయం కన్నా చాలా తక్కువ ఖర్చుపెట్టడమే...ఏ మనిషి విజ్ఞానానికైనా, శూరత్వానికైనా, నేర్పుకైనా నిదర్శనం- అని ఈ శ్లోకం చెబుతుంది. పొదుపు ఒక్క డబ్బు విషయంలోనే కాదు-కాలం, వనరులు, నీరు, చెట్టు, విద్యుత్, ఆహారం వంటి అన్నిటిలోనూ అవసరమే. డబ్బుతో పాటు ప్రకృతి వనరులు ఏ ఒక్కటి వృధా అయినా... దాని ఫలితం భవిష్యత్తరాలు ఎదుర్కోవాల్సి వుంటుంది. పొదుపు అనే దివిటీని చేపట్టి... ఆర్థికంగా సుస్థిరమైన భవిష్యత్తు వైపునకు అడుగులు వేద్దాం.

సామాన్యుల నుంచి వీఐపీల వరకు.. ఆర్థిక క్రమశిక్షణ లేని జీవితాలు కూలిపోయాయి. ఉన్నప్పుడు అవలంబించాల్సిన నియమాలు చేజారాక లబోదిబోమంటే ఏం లాభమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉన్నంతలో ఎవరికి వారే ఆర్థిక క్రమ శిక్షణ పాటించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. ప్యాకేజీ ఎంతొచ్చినా పొదుపుపై అవగాహన లేకపోతే అంతేసంగతులు. అది లక్షల జీతమైనా.. అమెరికా కొలువైనా పొదుపు మంత్రం పాటించకపోతే జీవితాలు తారుమారవుతాయి. చాలా మంది ఆర్థిక క్రమశిక్షణ లేక జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ఓ దశలో ప్రాణాలు కోల్పోవల్సిన ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతాయి. అందుకే పొదుపు సూత్రాన్ని పాటించాలని నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక కష్టాల నుంచి బయటపడే మార్గం సుగమం చేసుకోవాలని సూచిస్తున్నారు.

– గంగాధర్ వూరడి

## పొదుపు సూత్రాలు

- ప్రతి కుటుంబంలో ఒక ఆర్థిక నిధి ఏర్పాటుచేసుకోవాలి.
- అనుకోని కష్టాలు వచ్చినప్పుడు ఆ నిధి ఆదుకుంటుంది.
- ఒకే వ్యక్తి పలు పథకాల కింద రుణాలు పొందటం కుటుంబానికి చాలా భారంగా మారే ప్రమాదం ఉంది. ఇటువంటి అన్ని అంశాలపై అవగాహన అవసరం.
- అనేక బ్యాంకులు క్రెడిట్ కార్డుల్ని ఇస్తున్నాయి. అత్యవసరం అనుకుంటేనే వాటిని వినియోగించాలి. అనవసర ఖర్చులతో అప్పులపాలవ్వొద్దు.
- స్వల్ప సమయానికి భారీగా వడ్డీ ఇస్తామంటూ చాలా సంస్థలు బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తుంటాయి. వాటి వలలో పడొద్దు.
- చిన్న ఉద్యోగులు, మధ్యతరగతి వారు తప్పకుండా ఆరోగ్యబీమా తీసుకోవాలి. పలు సంస్థలు తమ ఉద్యోగులకు నామమాత్రపు మొత్తాలతో ఈ సౌకర్యాన్ని అందిస్తున్నాయి.
- ఉద్యోగులకు వ్యక్తిగత బీమా సౌకర్యం తప్పనిసరి. రోడ్డుపై జరిగే ప్రమాదాల్లో ప్రమాదం ఏర్పడితే దానికి బీమా పొందే వీలుంటుంది.



పరాయి పాలనలో మగ్గుతున్న దేశాన్ని బానిసత్వపు శృంఖలాల నుంచి విడిపించి, సమాజాన్ని బాగుపరచడానికి ఎన్నో సంస్కరణలు చేపట్టి నవీన భారతదేశ సంస్కర్తలలో అగ్రగణ్యులుగా నిలిచారు స్వామి దయానంద సరస్వతి. దయానందుల అసలు పేరు మూల శంకర్. చిన్ననాడే భగవంతుడ్ని దర్శించాలనే తలంపుతో ఇల్లు వదలి వెళ్లి మధురలోని విరజానంద సరస్వతుల వద్దకు చేరారు. వారి సాన్నిధ్యంలో వేద, వేదాంత విద్యలను అభ్యసించి, సమాజం పట్ల అవగాహన రావడానికి గురువుల అనుమతితో దేశాటనకు బయలుదేరారు. ఆనాటి సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను చూసి చలించిన దయానంద తన జీవితం ఇక సమాజసేవకే అంకితమని నిశ్చయించుకున్నారు.

# సంస్కర్తల్లో అగ్రగణ్యుడు.. దయానంద సరస్వతి



అభిషేక్ కురుమ

దయానంద సరస్వతి సతీ సహగమనం, బాల్యవివాహాలపై తీవ్రంగా పోరాడి జనాలలో గణనీయమైన మార్పు తీసుకొచ్చారు. కర్మసిద్ధాంతాన్ని, పునర్జన్మను గట్టిగా విశ్వసించే దయానందులు ఆచార వ్యవహారాలను మాత్రం వ్యతిరేకించారు. ఆర్యసమాజాన్ని స్థాపించి స్త్రీ జాతి సముద్ధరణకు నడుం బిగించారు. స్వధర్మానికి తిరిగి చేరుకునే వారికోసం ఆర్యసమాజం ద్వారా శుద్ధి కార్యక్రమం నిర్వహించేవారు. వీరు చేపట్టిన సంస్కరణలకు ఆనాటి ప్రముఖ నాయకులు సైతం ప్రభావితమయ్యారు. వేదాలు మానవులు రచించినవి కావనీ, సాక్షాత్తూ పరమాత్మ నుండే ఉద్భవించాయని బలంగా నమ్మిన వీరు 'సత్యార్థ్ ప్రకాశ్' పేరుతో వేదాల సారాన్ని సామాన్యుడి దాకా చేర్చే ప్రయత్నం చేశారు. అంతటితో ఆగకుండా వేదాలను ఆధునిక కోణంలో చూడాలన్న దృక్పథంతో వేదాలకు వీరు రాసిన భాష్యం 'దయానంద భాష్యం' పేరుతో సుప్రసిద్ధమైంది. వేదాలు చెప్పిన స్త్రీ సమానత్వం గురించి విస్తృతంగా ప్రచారం చేశారు. వేదాలతో పాటు ప్రాథమిక విద్య అవసరాన్ని గుర్తించి అనేక కళాశాలలు నెలకొల్పి విద్యాదానం చేశారు. జాతీయవాదిగా తన బోధనలతో భారతదేశాన్ని సాంఘికంగా, మతపరంగా సంఘటిత పరచి ప్రజలలో దేశభక్తిని, జాతీయభావాన్ని పెంపొందించేలా అవిరళ కృషి సల్పి, హిందూధర్మానికి ఆయన చేసిన సేవ తరతరాలకు ఆదర్శం.



# గోపాష్టమి.. గోమాతకు వందనం

దీపావళి తరువాత, కార్తీక నెల శుక్లపక్ష అష్టమిని గోపాష్టమిగా జరుపుకుంటారు. ఈ రోజున అరణ్యంలోకి కృష్ణుడిని వెంట ఆవులను పంపినట్లు విశ్వాసం. అందుకే ఈ రోజున ఆవులు ప్రత్యేకంగా పూజలందుకుంటాయి. ఇలా చేస్తే సమస్త దేవతలు గోమాత ఆరాధనతో సంతృప్తి చెందుతారు. గోవులకు గోపాష్టమి రోజున పశు గ్రాసం, ఆకుపచ్చని బఠాణీలు, గోధుమలను ఆవుకు పెడితే.. సర్వాభీష్టాలు నెరవేరుతాయి.

ఆవులో 33 కోట్ల దేవతలు కొలువైవుంటారు. గోవుకే మాత అనే హోదాను ఇచ్చారు. అలాంటి అమ్మలాంటి గోమాతను పూజించే వారికి అష్టైశ్వర్యాలు చేకూరుతాయని పండితులు చెప్తున్నారు. అందుకే.. గోపాష్టమి రోజున గోవులను శుభ్రమైన నీటితో కడిగి.. పసుపుకుంకుమలతో అలంకరించుకోవాలి. కొమ్ములకు రంగుల దారాలు కట్టాలి. ఆపై అరటి పండ్లను గోమాతకు నైవేద్యంగా ఇవ్వాలి. కర్పూర హారతినిచ్చి గోవును మూడు సార్లు ప్రదక్షణలు చేయాలి. గోవు తోక భాగాన్ని స్పృశించి నమస్కరించాలి. గోవుకు వెనుక భాగం నుంచి కర్పూర హారతిని ఇవ్వాలి. గోవు పరదేవతా



స్వరూపము. గోవులకు అధిష్ఠాన దేవత సురభీదేవి. కామధేనువు పరాశక్తియైన లక్ష్మీస్వరూపం. ఈ "శ్రీ సురభ్యై నమః" అనే మంత్రాన్ని జపించి, క్రింది స్తోత్రాన్ని గోసన్నిధిలో పఠిస్తే, ఆయురారోగ్యైశ్వర్యాలు, అభీష్టసిద్ధులు సంప్రాప్తిస్తాయి.

- నవ్య

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.